## చదివేది డిగ్రీ.. చేసేది గంజాయి రవాణా

అమరావతి, (సువార్త ప్రతినిధి): మండుతున్న ఎండలతో రాష్ట్రం నిప్పుల కుంపటిగా మారింది. ప్రజలు దాదాపుగా ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఎండల తీవ్రతకు అనుగుణంగా గృహ వినియోగం భారీగా ఉండటంతో రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ గత రెండు రోజులుగా గణనీయంగా పెరిగింది. రాష్ట్ర విద్యుత్తు శాఖ చరిత్రలోనే రికార్డు స్థాయిలో 285 మిలియన్ యూనిట్ల వినియోగం నమోదైంది. 278.9 ఎం.యూ. విద్యుత్తు వినియోగించారు. గతేడాది ఏప్రిల్, మే నెలల్లో గరిష్ఠంగా 256 ఎంయూ వినియోగం మాత్రమే నమోదైంది.ఈ ఏడాది మార్చి 7న గరిష్ఠంగా 274.6 ఎంయూలు వినియోగించారు.

RNI NO: APBIL/2015/67544

# సువార్త

SUVAARTHA


సమగ్ర రాజకీయ, సామాజిక, ఆధ్యాత్మిక వార్తపత్రిక

## పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లపై పరిమితులు లేవు: కేంద్రం

(సువార్త ప్రతినిధి): దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లపై ఎలాంటి పరిమితులు లేదా ఆంక్షలు లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంధన కొరత ఏర్పడిందనే భయాందోళనల నేపథ్యంలో, దేశంలో తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయని, డిమాండ్‌ను తీర్చడానికి సరఫరాలు స్థిరంగా ఉన్నాయని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ తెలిపారు. ఇంధన పంపిణీలో అవకతవకలపై చర్యలు తీసుకుంటున్నామని, సుమారు 500 చోట్ల దాడులు చేశామని, సోషల్ మీడియా పుకార్లను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సంపుటి : 11 సంచిక :31, సంపాదకులు: Ch.I ప్రశాంత్ కుమార్ మే 24 నుంచి 31 వరకు 2026 పేజీలు: 8, వెల:రూ. 5/.

## భారత్ ఎన్నటికీ తలవంచదు: అమిత్‌షా



న్యూఢిల్లీ:(సువార్త ప్రతినిధి): సరిహద్దు చొరబాట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. ఇందుకోసం జీరో టాలరెన్స్ పాలసీని అనుసరించనున్నామనీ, దేశ సరిహద్దులను మూసివేసేందుకు ఏడాదిలోగా సమగ్ర 'స్మార్ట్ బోర్డర్' పాలసీని తీసుకురానున్నామని చెప్పారు. అక్రమ వలసదారులను వెనక్కి తిప్పిపంపుతామని స్పష్టం చేశారు.న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారంనాడు జరిగిన సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) సిబ్బంది సమావేశంలో అమిత్‌షా మాట్లాడుతూ, అక్రమ వలసలను కృత్రిమంగా దేశ జనాభాలో మార్పు తెచ్చేందుకు ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న కుట్రగా అభివర్ణించారు. దేశ డెమోగ్రాఫిక్స్‌ను సురక్షితంగా ఉంచేందుకు అక్రమ వలసదారులను ప్రభుత్వం గుర్తించి ప్రతి ఒక్కరిని వెనక్కి పంపిస్తుందని స్పష్టం చేశారు. ఇందుకోసం దేశంలోని 6,000 కిలోమీటర్ల పొడవైన అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి అభేద్యమైన భద్రతా గ్రిడ్‌ను అమలు చేస్తుందని చెప్పారు. స్మార్ట్ బోర్డర్ కాన్సెప్ట్ కింద రాడార్లు, అడ్వాన్స్‌డ్ కెమెరాలతో బీఎస్ఎఫ్‌ను అధునాతన టెక్నాలజీతో సన్నద్ధం చేస్తామని వివరించారు.

## ఏపీ అటవీ శాఖపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష..



అమరావతి:(సువార్త ప్రతినిధి):ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జూన్ నెలలో నిర్వహించనున్న విత్తన బంతుల (సీడ్ బాల్స్) తయారీ కార్యక్రమంపై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో 2.5 కోట్ల విత్తన బంతులను పంపిణీ చేయాలని అధికారులను పవన్ ఆదేశించారు. వీటి తయారీ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని అన్నారు. అందుకు అన్ని వర్గాల ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ ఏడాది వర్షాకాల సీజన్‌ను పూర్తిగా వినియోగించుకోవాలని అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. జులై, ఆగస్టు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా విత్తన బంతులను విస్తారంగా చల్లడానికి అటవీ శాఖ ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. ఇందుకోసం మూడు రకాల ప్రత్యేక పద్ధతులను ఉపయోగించాలని సూచించారు. నేరుగా చల్లడం, అత్యాధునిక డ్రోన్ సాంకేతికతను వినియోగించడం, చేతులతో నాటడం చేయాలని ఆయన పేర్కొన్నారు. అడవుల్లో జీవ వైవిధ్యాన్ని పెంపొందించడం, స్వచ్ఛమైన, పచ్చని ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడం ఈ హరిత ఉద్యమ ప్రధాన లక్ష్యమని పవన్ చెప్పుకొచ్చారు.మనం చల్లే ప్రతి విత్తన బంతి.. మన భవిష్యత్తుకు ఇచ్చే ఒక నమ్మకమైన హామీగా మారాలని ఉప ముఖ్యమంత్రి అన్నారు. రాబోయే తరాల కోసం ఆంధ్రప్రదేశ్‌ను మరింత పచ్చగా, ఆరోగ్యకరంగా, సుస్థిరంగా మార్చేందుకు మనమంతా చేతులు కలపాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

## పూర్తి ఉచితంగా హోంగార్డులకు ఆరోగ్య బీమా: హోం మంత్రి అనిత

విశాఖపట్నం,(సువార్త ప్రతినిధి):విశాఖలో హోంగార్డు ఆరోగ్య బీమా సహాయ కేంద్రం ఈరోజు(శుక్రవారం) ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొని కేంద్రాన్ని ప్రారంభించారు. దేశంలోనే మొదటిసారిగా హోంగార్డులకు ప్రత్యేక ఆరోగ్య బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం అందిస్తోంది. సుమారు రూ.33 లక్షల వరకు బీమా కవరేజ్‌ను పొందవచ్చు. హోం మంత్రి అనిత ప్రోత్సాహంతో మొదటి విడతగా 975 మంది హోంగార్డులకు ఆరోగ్య బీమాను అందించనున్నారు. ఈ బీమా పథకం కింద భర్త, భార్య, ఇద్దరు పిల్లల వరకు కవరేజ్ ఉంటుంది.

ఈ సందర్భంగా హోం మినిస్టర్ అనిత మాట్లాడుతూ.. పోలీసు వారికి వర్తించే ఆరోగ్య భద్రత.. హోంగార్డులకు వర్తించకపోవడం, వారి వేతనాలు తక్కువగా ఉండటం వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఏడాది రూ.3 లక్షల నుంచి రూ.33 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం



అందుబాటులో ఉంటుందని ప్రకటించారు. దీని ద్వారా సుమారు 3,140 మంది లబ్ధి పొందనున్నారని తెలిపారు. హోంగార్డుల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా పూర్తి ఉచితంగా ఈ బీమా సదుపాయాన్ని అందిస్తున్నామని తెలిపారు. విధుల్లో మరణించిన హోంగార్డుల కుటుంబాలకు తిరిగి ఉద్యోగం కల్పించే పరిస్థితి లేనందున.. ఆ కుటుంబాలకు ఏ కష్టం వచ్చినా ఈ ఆరోగ్య బీమా ఎంతో సహాయపడుతుందని హోం మంత్రి అనిత వివరించారు.

## ప్రకృతి వ్యవసాయంతో అద్భుతాలు చేస్తున్న ద్వారకానాథరెడ్డిని అభినందించిన లోకేష్

**కడప జిల్లాలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన మంత్రి లోకేష్**

**సమీకృత సేంద్రియ సాగుతో సక్సెస్ అయిన రైతు ద్వారకానాథ రెడ్డితో భేటీ**

**జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ సీఎం చంద్రబాబు లక్ష్యమని వెల్లడి**

**రసాయన ఎరువులు వీడి సేంద్రియ సాగు వైపు రావాలని రైతులకు పిలుపు**

**ఆదర్శ రైతు కుటుంబాన్ని అభినందించి, ప్రభుత్వ అండ ఉంటుందని హామీ**



(సువార్త ప్రతినిధి): రసాయన ఎరువుల వాడకంతో దెబ్బతింటున్న భూసారాన్ని కాపాడుతూ, పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవాలంటే రైతులు సేంద్రియ సాగు వైపు మళ్లాల్సిన అవసరం ఉందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమైన 'జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్' విధానాన్ని క్షేత్రస్థాయిలో ప్రోత్సహించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. కడప జిల్లాలో తన రెండు రోజుల పర్యటనలో భాగంగా, జమ్మలమడుగు నియోజకవర్గంలోని ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. సమీకృత సేంద్రియ సాగు పద్ధతులతో ఆదర్శంగా నిలుస్తున్న రైతు మునగాల ద్వారకానాథ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులతో లోకేష్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న మంత్రికి రైతు ద్వారకానాథరెడ్డి, ఆయన అర్ధాంగి రాఘవేంద్రవతి సాదరంగా స్వాగతం పలికారు.

## అనంతపురం జిల్లాలో గోల్డ్ మైన్స్ గుర్తింపు: మంత్రి కొల్లు రవీంద్ర

కర్నూలు, (సువార్త ప్రతినిధి): గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి పెట్టుబడి పెట్టాలంటే ఎవరు రాలేని పరిస్థితి ఉండేదని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. ఇప్పుడు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు పోటీపడి ముందుకు వస్తున్నారన్నారు. ఈరోజు(శుక్రవారం) తుగ్గలి మండలం జొన్నగిరిలో టీడీపీ కార్యకర్తల సమావేశంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. గత ప్రభుత్వంతో పోలిస్తే మైనింగ్ శాఖలో రూ. 4 వేల కోట్లు అధికంగా రాబడి వచ్చిందని తెలిపారు. చంద్రబాబు నాయుడు పరిపాలన విధానాన్ని చూసి భారత దేశంలో వచ్చిన పెట్టుబడులలో 25% ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చాయని అన్నారు.

## కేంద్ర మాజీ మంత్రి చిదంబరానికి లోకేశ్ కౌంటర్

అమరావతి,(సువార్త ప్రతినిధి): డీలిమిటేషన్‌పై కేంద్ర మాజీ మంత్రి చిదంబరం రియాక్షన్‌పై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. శుక్రవారం తన ఎక్స్ ఖాతా వేదికగా లోకేశ్ కౌంటర్ ఇచ్చారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 81 ప్రకారం.. 1971 జనగణన ఆధారంగా లోక్‌సభ సీట్ల కేటాయింపు నిలిపివేశారని ఏపీ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 2026 తర్వాత నిర్వహించే జనగణనతో ఈ ఫ్రీజ్ ముగుస్తుందని తెలిపారు. దీంతో సీట్ల పునర్విభజన తప్పనిసరి అవుతుందన్నారు. దేశంలో ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే.. దక్షిణాది రాష్ట్రాలు ప్రాతినిధ్యం కోల్పోయే అవకాశం ఉందన్నారు.ఇదే సమస్యను తమ పార్టీ ఎప్పటినుంచో ప్రస్తావిస్తోందని ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్ బిల్లు ద్వారా అన్ని రాష్ట్రాలకూ న్యాయం



చేయాలని కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రయత్నించిందని పేర్కొన్నారు. అయితే ఈ బిల్లును పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ ఎందుకు వ్యతిరేకించిందని ప్రశ్నించారు.2026 జనగణన తర్వాత పరిస్థితులపై కాంగ్రెస్ పార్టీ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తగ్గకుండా ఏం చర్యలు తీసుకుంటారో కూడా చెప్పాలని కాంగ్రెస్ పార్టీకి లోకేశ్ స్పష్టం చేశారు. ఈ మేరకు తన ఎక్స్‌లో మంత్రి లోకేశ్ పోస్ట్ చేశారు.

## జేఎస్‌సీ సమావేశాలపై క్యాలెండర్ విడుదల చేసిన ప్రభుత్వం

అమరావతి, (సువార్త ప్రతినిధి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ (జేఎస్‌సీ) సమావేశాలకు సంబంధించిన క్యాలెండర్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. అందులో 2026-27 సంవత్సరానికి జేఎస్‌సీ సమావేశాల షెడ్యూల్‌ను వివరించింది. అందుకు సంబంధించిన జీవో ఆర్‌టీ నంబర్ 1032ను సాధారణ పరిపాలన శాఖ శుక్రవారం రాజధాని అమరావతిలో విడుదల చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్, అక్టోబర్, ఫిబ్రవరి నెలల్లో జిల్లా స్థాయి జేఎస్‌సీ సమావేశాలు ఉంటాయని తెలిపింది. అలాగే జూన్, అక్టోబర్, ఫిబ్రవరి నెలల్లో హెచ్‌వోడీ స్థాయి సమావేశాలు నిర్వహిస్తామని స్పష్టం చేసింది. అదే విధంగా జులై, నవంబర్, మార్చిలో సచివాలయంలోని వివిధ శాఖల జేఎస్‌సీ సమావేశాలు ఉంటాయని పేర్కొంది. ఉద్యోగుల ఫిర్యాదుల పరిష్కారానికి వేదికగా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్స్ ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది.

# సంపాదకీయం

## మన స్వదేశీయంలో విదేశీయానిదే విజయమా?

సప్తపదులు, సప్తనదులు, సప్తస్వరాలు, సప్తరుషులు.. ఇట్లా ఏడు అంకె చుట్టూ అనేక జీవిత, ఖగోళ, భౌగోళిక అంశాలను ముడిపెట్టటం మనకు కొత్తకాదు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ మొదలుపెట్టిన యుద్ధంతో ఏర్పడిన సంక్షోభాన్ని ఎదుర్కోటానికి ప్రజలు త్యాగాలూ, పొదుపులూ చేయాలంటూ ప్రధాని మోదీ కూడా సప్తసూత్రాలను ప్రకటించారు. దేన్నైనా సప్తసూత్రాలుగా చెబితే ప్రజలను బాగా ఆకర్షిస్తుందనే మోదీ భావించి ఉండొచ్చు. సప్తానికి మన సంస్కృతి చాలా ప్రాధాన్యతను ఇచ్చింది. అందులో సందేహం ఏమీలేదు. ఇక సంస్కృతిలో బాగా పాతుకుపోయిన భావాలను ఉపయోగించుకుని రాజకీయంగా ప్రజలను సమాయత్తం చేయటం అన్ని దేశాల్లోనూ ఉంది. ఇటీవల కాలంలో ఈ విషయంలో మోదీ ప్రదర్శించే ప్రతిభ అసాధారణమైంది! ఇందులో ఆయన దరిదాపులకు వచ్చే నేతలను ప్రపంచం మొత్తంలోనే వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ఆచారాలు, నమ్మకాలు, ఇష్టాయిష్టాల్లో ఎంతో వైవిధ్యం ఉన్న దేశంలో మంచికైనా చెడుకైనా సంస్కృతిని ఆధారం చేసుకుని జనాన్ని రాజకీయ లక్ష్యాలవైపు ఆకర్షించటం అంత సులువుకాదు. రాజకీయ లక్ష్యాలు సంకుచితమైనవైతే సంస్కృతి కూడా చివరికి అదే దారిలోకి వెళుతుంది. దీనికి ఏ దేశమూ మినహాయింపుకాదు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు 40 రోజులపాటు భీకరంగా దాడులు చేశాయి. వీటిని అసాధారణలో రీతిలో తట్టుకుంటూ ఇరాన్ ప్రతిదాడులనూ చేసింది. గల్ఫ్‌దేశాల్లోని అమెరికా సైనికస్థావరాలు ఆ ప్రతిదాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్నాయి. అమెరికాకు ఇంతకు మించిన తలవంపు ఇటీవల కాలంలో మరొకటి లేదు. కాల్పుల విరమణ ప్రకటించిన తర్వాత కూడా హోర్ముజ్ జలసంధిని అమెరికా దిగ్బంధం చేయటంతో చమురు, సహజవాయువు, ఎరువుల రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ప్రపంచ సరఫరా వ్యవస్థే గాడితప్పింది. అయినా అయిదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసే వరకూ యుద్ధప్రభావం గురించి విపులంగా ప్రధాని మోదీ ఎప్పుడూ మాట్లాడలేదు. అంతకు ముందుకూడా అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధం అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకమని బహిరంగంగా ప్రకటించనూ లేదు. యుద్ధంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అయిపోతోందనీ దాన్ని దృష్టిలో పెట్టుకునైనా యుద్ధం ఆపాలనీ కోరలేదు. కొండెక్కిన చమురు ధరలతోనూ ఇతరత్రానూ దిగుబడుల భారం పెరిగి విదేశీ మారకద్రవ్య నిల్వలు భారీగా హరించుకుపోయే ప్రమాదం ముంచుకొస్తూ ఉండటంతో త్యాగాలు చేయాలనీ, పొదుపులు పాటించాలనీ ప్రజలకు పిలుపునిచ్చారు. సప్తసూత్రాల్లో స్వదేశీ వస్తువులను కొనాలనే పిలుపు కూడా ప్రధానంగా ఉంది. గ్లోబలైజేషన్ తర్వాత ఈ స్వదేశీ నినాదం ఎంతమేరకు ఆచరణాత్మకమో పరిశీలిస్తే మనకు ఆశ్చర్యం కలుగుతుంది. ఏదీ విదేశీ, ఏదీ స్వదేశీ అన్న గీతలు గీయటం కూడా కష్టమైపోతోంది. మేడిన్ ఇండియా వస్తువుల లోగుట్టుని లోతుగా చూస్తే అందులోని విదేశీయత రట్టు అవుతుంది. నూటికినూరుపాళ్లూ స్వదేశీ కంపెనీ ఉత్పత్తులనే కొనాలనుకుంటే మన ఎంపిక చాలా పరిమితం అయిపోతుంది. విదేశీ మారకద్రవ్యం పొదుపు లక్ష్యంగా ఇక్కడ తయారయ్యే వస్తువులను కొనుగోలు చేయించటమే మోదీ పిలుపు పరమార్థమైతే మనం పెద్దగా ఆలోచించాల్సిన అవసరం ఉండదు. 90శాతం మంది ప్రజలకు ఇక్కడే దొరికే వస్తువులే బోలెడు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో అచ్చంగా ఏవి స్వదేశీ అన్నవే సమస్య! మనం రోజూ వాడే వస్తువులనూ, ఉపకరణాలనూ స్వదేశీ కంపెనీలే తయారుచేయటం లేదు. అవి ఇక్కడ ఉత్పత్తి అవుతున్నా వాటిని స్వదేశీయతకూ, స్వావలంబనకూ ఉదాహరణలుగా చెప్పుకోలేం. అవన్నీ ప్రధానంగా విదేశీ కంపెనీల చేతుల్లో ఉన్నాయి. సర్ఫ్ ఎక్సెల్, లక్స్, లైఫ్‌బాయ్, క్లినిక్ ప్లస్, డవ్, క్లోజప్, బ్రూక్‌బాండ్ రెడ్‌లేబుల్, బ్రూ, హార్లిక్స్, బూస్ట్, లేస్, ట్రోపికానా, జిలెట్, హెడ్ అండ్ షోల్డర్స్, కాల్గేట్, పెప్సొడెంట్, మ్యాగీ, నెస్‌కేఫ్, కిట్‌క్యాట్, సెరెలాక్, కెల్లాగ్ కోర్న్‌ఫ్లేక్స్, కోకకోలా, థమ్స్‌అప్, పెప్సీ, కుర్కురే, వ్యాసలీన్, లాక్మే, పాండ్స్, రిన్, పియర్స్ లాంటి ఉత్పత్తులన్నీ విదేశీ బహుళజాతి సంస్థలకు అనుబంధంగా ఉన్న కంపెనీల నుంచే వస్తున్నాయి. మనం వినియోగించే వస్తువులన్నీ లెక్కలోకి తీసుకుంటే ఈ జాబితా ఇంకా పెరుగుతుంది. ఈ కంపెనీల్లో భారతీయుల పెట్టుబడులు లేవా? అంటే ఉన్నాయి. అవన్నీ చాలా వరకూ 45శాతం లోపే ఉంటాయి. కానీ విదేశాల్లోని మూల కంపెనీలకు సంబంధించిన పెట్టుబడులే అధికంగా ఉంటాయి. కీలక నిర్ణయాలన్నిటినీ అవే శాసిస్తాయి. ఐటీసీ, అమూల్, డాబర్, మ్యారికో, బ్రిటానికా, గోద్రేజ్, పార్లే లాంటి భారత కంపెనీల ఉత్పత్తులు కూడా మార్కెట్‌లో రాణిస్తున్నాయి. కానీ వీటి ఉత్పత్తుల వాటా మార్కెట్‌లో 42▪48శాతం మధ్యలోనే ఉంటుంది. వీటితో పోల్చితే బహుళజాతి సంస్థల అనుబంధ కంపెనీల ఉత్పత్తుల వాటా ఎక్కువ. అది 52▪58శాతం ఉంటుంది. నెలనెలా వాడుకునే ఈ ఉత్పత్తుల్లో భారత యాజమాన్యంలోని కంపెనీల వాటా 45శాతం ఉండటం ఊరటగా అనిపించొచ్చు. కంప్యూటర్లు, వాహనాలు, రిఫ్రిజిరేటర్లు, మొబైల్స్ దగ్గరకు వెళితే స్వదేశీ కంపెనీలు ఎక్కడో ఉంటున్నాయి. ముందుగా మొబైల్ ఫోన్ల సంగతి చూద్దాం. భారతీయుల యాజమాన్యంలో ఉన్న మొబైల్ కంపెనీలు లావా, మైక్రోమాక్స్, కార్బన్ తయారుచేసే మొబైళ్ల మార్కెట్ వాటా 2▪3శాతం మధ్య ఊగిసలాడుతూ ఉంటుంది. మిగతావన్నీ విదేశీ కంపెనీల మొబైళ్లే. యాపిల్ ఫోన్లను ఇక్కడ తయారుచేసే కంపెనీల్లో కూడా ఫాక్స్‌కాన్‌దే (తైవాన్) ఆధిపత్యం. మన టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీ కూడా 35 శాతం వరకూ యాపిల్ ఫోన్లను తయారుచేస్తోంది. విస్ట్రన్, పెగట్రాన్ లాంటి తైవాన్ కంపెనీలో షేర్లు కొనుగోలుచేసి యాజమాన్యాన్ని పొందటంతో టాటా ఎలక్ట్రానిక్స్ ఆ పనిని సులభంగా చేయగలుగుతోంది. ఇక రిఫ్రిజిరేటర్ల పరిస్థితి చూసినా మనకు ఈ దృశ్యమే కనపడుతుంది. పది ప్రధాన బ్రాండ్లను తీసుకుంటే అందులో గోద్రేజ్, వీడియోకోన్‌లు మాత్రమే స్వదేశీ యాజమాన్యం కింద ఉన్నాయి. మిగతావన్నీ విదేశీ యాజమాన్యాలకు చెందినవే. వాటి మార్కెట్ వాటా 80▪90శాతం మధ్యలో ఉంటుంది. కార్ల వ్యవహారాన్ని చూసినా పరిస్థితిలో మార్పు కొద్దిగానే కనపడుతోంది. భారతీయ కంపెనీల కార్ల మార్కెట్ వాటా ఇప్పటికీ 15▪25 శాతం మధ్యలోనే ఉంది. 12 ప్రధాన కార్ల కంపెనీల్లో టాటామోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా మాత్రమే భారత యాజమాన్యానికి చెందినవి. విదేశీ కార్ల కంపెనీల మార్కెట్ వాటా 75▪85శాతం మధ్యలో ఉంటుంది. కంప్యూటర్ల తయారీలో స్వదేశీ కంపెనీల వాటా 3▪10శాతం మధ్యలో ఉంటే విదేశీ కంపెనీలు 90▪97శాతం వాటాతో మార్కెట్‌ను శాసిస్తున్నాయి.

# ఉప్మాక చెరువుకు మహర్దశ




అనకాపల్లి : (సువార్త ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ విజయ్ క్రిష్ణన్ ముందు చూపుతో గ్రామీణ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ అభివృద్ధి, సాగు నీటి సదుపాయాల పెంపు, రైతుల సంక్షేమం కోసం, జలధార జలహారతి పథకంను విస్తృతంగా అమలు చేస్తోంది. ఈ పథకం గొలుగొండ మండలం పప్పు శెట్టిపాలెం గ్రామపంచాయతీ ఉప్మాక చెరువు రూ.20 లక్షలు అంచనా వ్యయంతో పనులకు పరిపాలనా ఉత్తర్వులు జారీ చేయడం అనేది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పాన్ని ప్రతిబింబిస్తోంది. ముఖ్యంగా పూడికతీత, గట్లు పునర్నిర్మాణము పనులు ఇంత పెద్ద ఎత్తున గొలుగొండ మండలం పప్పు శెట్టి పాలెం పంచాయితీలో చేపడుతున్న పూడికతీత పనులతో ప్రతి చెరువు నిండుకుండలా జల కళను సంతరించుకుంటుంది. ఈ పనుల ద్వారా200 ఎకరాలకు ఆయకట్టు సాగు నీటి లబ్ధి చేకూరుతుంది.గొలుగొండ మండలం పప్పు శెట్టిపాలెం గ్రామ పంచాయతీ నందు ఉప్పాక చెరువు పూడికతీత తోపాటు గట్లు పునర్నిర్మాణముపనులకు రూ.20 లక్షలతో చేపట్టారు. 332 మంది ఉపాధి హామీ వేతనదారులతో10 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువు పూడికతీత గట్లు పునర్నిర్మాణ పనులను చేపడుతున్నారు. అటవీ ప్రాంతంలో కురిసే వర్షపు నీరు కాలువ ద్వారా చెరువుకు చేరనుంది. తద్వారా ఈ పంచాయతీతో పాటు పరిసర ప్రాంతాల గ్రామ పంచాయతీ లోని పంట భూములకు సాగునీరు కూడా అందనుంది. ఈ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న మామిడి, వరి కూరగాయల పంటలకు నీరు సంవృద్ధిగా లభించనుంది. ఈ చెరువు పరిధిలో సుమారు 200 ఎకరాలకు ఆయకట్టుకు నీరు అందడంతో పాటు గణనీయంగా బోర్లు, బావులలో భూగర్భ జలాలు పెరగనుంది. జలధార జలహారతి కార్యక్రమంలో భాగంగా ఈ చెరువును పునరుద్ధించడం వలన చెరువుకు నీరు రావడంతో పాటు పశువులకు త్రాగు నీరు సమృద్ధిగా లభించడం, బోర్లు రీఛార్జ్ కావడం జరుగుతుందన్నారు. అదే విధంగా పంట పొలాలకు సాగు చేసుకోవడానికి సాగునీటి కొరత లేకుండా ఈ పథకం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు.

332 మంది తో ఉపాధి హామీ పథకం ద్వారా జలధార– జలహారతి పనులు చేపట్టడం వలన ప్రతి కుటుంబానికి ఉపాధి దొరకడంతో పాటు వలసలు వెళ్ళే పరిస్థితి కనుమరుగైంది. ఈ పనుల ద్వారా జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సుమారు అదనంగా రూ.30 వేలు వరకు ఆదాయం కలుగుతోందన్నారు. ఈ పనులు కల్పించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేయుచున్నారు.


ఈ కార్యక్రమం వల్ల వలసలు తగ్గి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతోంది. రైతులు మామిడి, వరి, కూరగాయల సాగుతో పాటు నీటి కొరత లేకుండా సంతోషంగా సాగు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని జిల్లా సమాచారం పౌర సంబంధాల అధికారి తెలిపారు.

# ప్రజలపై భారాలు వేసే పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించండి : సిఐటియు తాడేపల్లి మండల కన్వీనర్




తాడేపల్లి రూరల్ (గుంటూరు) (సువార్త ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు అనంతరం రెండుసార్లు పెట్రోల్ డీజిల్ ధరలు పెంచిందని, సామాన్యుడిపై భారాలు పెంచే పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని సిఐటియు తాడేపల్లి మండల కన్వీనర్ పల్లె కృష్ణ అన్నారు. ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి గ్రామ సచివాలయం వద్ద ఉదయం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల తో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి కృష్ణ మాట్లాడుతూ బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరంకుశ వైఖరితో ప్రజలపై భారాలు వేసేందుకు పూనుకుందని అన్నారు. ప్రజలపై భారాలు వేయడమే పనిగా మోడీ ప్రభుత్వం చేస్తుందని అన్నారు. ఒకవైపున నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం వలన నిత్యవసర ధరలు విపరీతంగా పెరుగుతాయని అన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని సిఐటియు డిమాండ్ చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచంలో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గిన ఎన్డీఏ ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం అన్యాయం అన్నారు. ఇప్పటికే పెరిగిన గ్యాస్ ధరలతో ప్రజల సతమతం అవుతుంటే పెట్రోల్ డీజిల్ ధరలు రెండుసార్లు పెంచటం ప్రజల నెత్తిన మరింత భారాలు వేయటానికేనని ఆయన విమర్శించారు. రష్యా కారు చౌకగా ఆయిల్ సరఫరా చేస్తామన్న ట్రంప్ ఆదేశాలకు మోడీ తలొగ్గారాని అన్నారు.వెంటనే కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ ధరను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అమ్మిశెట్టి రామారావు, నల్లపు లెనిన్, పారిశుద్ధ్య కార్మికులు కోటేశ్వరి, చిన్నప్ప, రాంబాబు, సుజాత, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# స్విగ్గీ ఎండి, సిబ్బందికి నాన్ బెయిలబుల్ వారెంట్



కర్నూలు క్రైమ్ (సువార్త ప్రతినిధి): వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఆదేశాలు బేఖాతరు చేస్తున్న స్విగ్గీ యాప్ ఎండీ, సిబ్బందికి కమిషన్ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. వివరాలిలా.. కర్నూలుకు చెందిన ఓ వినియోగదారుడు గతేడాది డిసెంబరులో స్విగ్గీ యాప్ ద్వారా కర్నూలు ఆర్ ఎస్ రోడ్డులోని న్యూ అప్సరా హోటల్లో వెజ్ బిర్యానీ ఆర్డర్ చేశారు. అందులో చికెన్ ముక్కలు ఉండటంతో మనస్తాపం చెందిన వినియోగదారుడు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఇరువురి వాదనలు విన్న కమిషన్‌ఢ స్విగ్గీ నిర్వాహకులు, ఇతర ప్రతివాదులు ఫిర్యాదుదారునికి రూ.50 వేల నష్ట పరిహారం, కోర్టు ఖర్చుల కింద మరో రూ.ఐదు వేలు చెల్లించాలని గతేడాది డిసెంబరు 31న ఆదేశించింది. స్విగ్గీ నిర్వాహకులు కమిషన్ ఆదేశాలను అమలు చేయకపోవడంతో పలుమార్లు నోటీసులు జారీ చేసింది. గురువారం తమ ముందు హాజరవ్వాలని నోటీసులివ్వగా వారు స్పందించకపోవడాన్ని తీవ్రంగా పరిగణించిన కమిషన్‌ఢ బెంగళూరులోని స్విగ్గీ ఎండీ, ఆ సంస్థ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్, బండ్ల టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ గ్రీవెన్స్ ఆఫీసర్, న్యూ అప్సరా హోటల్ మేనేజర్ లకు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది. ఈ కేసును జూన్ 22కు వాయిదా వేసింది.

# తిరుమలలో భారీగా పెరిగిన రద్దీ



తిరుమల : (సువార్త ప్రతినిధి):విద్యార్థులకు వేసవి సెలవుల నేపథ్యంలో శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే యాత్రికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. నుంచి యాత్రికులు భారీగా తరలి రావడంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 1, 2లోని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయాయి. ప్రస్తుతం నారాయణగిరి ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన షెడ్లలో కూడా నిండి బాట గంగమ్మ ఆలయం క్యూలైన్ కొనసాగుతోంది. అయితే రద్దీ పెరగడంతో తిరుమలకు వచ్చే యాత్రికులకు టిటిడి పలు కీలక సూచనలు చేసింది. యాత్రికులు క్యూలైన్లలోకి రావద్దని, శుక్రవారం ఉదయం ఆరు గంటలకు రావాలని చెప్పింది. తిరుమలలో యాత్రికుల రద్దీ నెలకొనడంతో వారి సౌకర్యార్థం టిటిడి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. వారికి ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కల్పించేందుకు బాటగంగమ్మ సర్కిల్ నుండి గోగర్భం డ్యామ్ సర్కిల్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్ వరకు చలువ పందిళ్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్–2, మ్యూజియం ప్రాంగణం, నారాయణగిరి ఉద్యానవనాల్లో నీడనిచ్చే షెల్టర్లు ఏర్పాటు చేసింది. ఉదయం అల్పాహారంగా పాలు ఉప్మా, పొంగల్, మధ్యాహ్నం సాంబారన్నం, పులిహోర, టమోట రైస్, రాత్రి పాలు ఉప్మా, సాంబారన్నం యాత్రికులకు నిరంతరాయంగా పంపిణీ జరుగుతోంది.

# అర్ధరాత్రి ఏనుగుల గుంపు బీభత్సం

చంద్రగిరి :(సువార్త ప్రతినిధి): తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం రంగంపేట దగ్గర నాగపట్ల ప్రాంతం, రాగిమానుగుంటలో ఏనుగుల గుంపు రాత్రి బీభత్సం సృష్టించాయి. అర్ధరాత్రి గోపాలరెడ్డి మామిడి తోటలోకి వచ్చిన ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడి చేసి పూర్తిగా ధ్వంసం చేసాయి. ఏనుగుల గుంపు గ్రామ పరిసరాల్లోకి చొరబడి, అర్ధరాత్రి ఏనుగులు పంట పొలాల్లో భీకర శబ్దాలతో గీంకరిస్తుండగా, గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రైతుల మామిడి తోట, ఫెన్సింగ్ కూసాలు, నీటి పైపులను ఏనుగులు పూర్తిగా ధ్వంసం చేసాయి. మూడు రోజులుగా నాగపట్లలోనే గజరాజులు చేరినట్లు రైతులు అనుమానిస్తున్నారు. వెంటనే ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు గ్రామస్తులు తెలియజేశారు. అటవీశాఖ అధికారులు ఏనుగుల అటవీప్రాంతంలోకి తరిమేందుకు, బాణా సంచా పేలుస్తూ, డప్పు శబ్దాలతో ప్రయత్నించారు. పంట నష్టం తప్ప ఎటువంటి ప్రమాదం జరగలేదు. గ్రామస్తులు రాత్రిపూట బయటకు



రాకూడదని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు అటవీశాఖ అధికారులు తెలియజేసారు.

# అథ్లెటిక్స్ ఎంపికలకు 120 మంది క్రీడాకారులు హాజరు

విజయనగరం టౌన్ :(సువార్త ప్రతినిధి): విజయనగరంలో నిర్వహించిన శాప్ లీగ్స్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ (బాల బాలికల) సెలెక్షన్స్ కు విశేష స్పందన లభించింది. 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. శాప్ ఇయర్ లాంగ్ క్యాలెండర్ ప్రకారం విజ్జి స్టేడియంలో జరిగిన శాప్ లీగ్స్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ (బాల బాలికల) సెలెక్షన్స్ కు జిల్లా నలుమూలల నుండి సుమారు 120 మంది ఈ పోటీలో పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో (అండర్ -16,-20) జరిగిన ఈ పోటీల నందు విభాగం చొప్పున మొత్తం 40 మందిని, 4 మేనేజర్ లతో త్వరలో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపబడునని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు



హాజరయ్యే జట్లకు రవాణా ఖర్చులు, క్రీడా దుస్తులు ఇవ్వబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిక పోటీలు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎస్ వెంకటేశ్వరావు, జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ గోపాల్ , అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ శిక్షకులు ఆధ్వర్యంలో జరిగాయి.

# పిడుగురాళ్లలో 48.1 డిగ్రీలు



అమరావతి బ్యూరో :(సువార్త ప్రతినిధి): రాష్ట్రంలో భానుడి భగభగలు ఏమాత్రం తగ్గడం లేదు. నాడు పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 48.1 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇక్కడే గురువారం 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, దానిని ఈ సీజన్‌లో అత్యధికమని విపత్తుల నిర్వహణ శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా అంతకన్నా ఎక్కువ ఉష్ణోగ్రత నమోదుకావడం గమనార్హం. గురువారం 18 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు దాటాయి. 20 జిల్లాల పరిధిలోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భారీ ఉష్ణోగ్రతలు, వడగాడ్పులతో ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటోంది. మరో 4 రోజుల పాటు ఎండల తీవ్రత ఇదే మాదిరి కొనసాగే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. నేడు అల్లూరి సీతారామరాజు, పోలవరం, బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45 నుంచి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, 15 మండలాల్లో తీవ్ర వడ గాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపింది. శనివారం పోలవరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45 నుంచి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణశాఖ తెలిపింది.

# నగరానికి ఆండ్ర జలాశయం నుంచి నీరు విడుదల



-విజయనగరం (సువార్త ప్రతినిధి): నగర వాసులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఆండ్ర జలాశయం నుంచి అదనపు నీరు విడుదలవుతుందని కమిషనర్ బాలస్వామి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు ఆండ్ర జలాశయం నుంచి 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేసే ప్రక్రియను నేడు ప్రారంభించారు. అక్కడి నుంచి నేరుగా చంపావతి నదిలోకి నీరు వచ్చి చేరుతుందన్నారు. నేటి నుండి జూన్ 6 వరకు నీటి విడుదల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జూన్ మాసాంతం వరకు విడుదలైన నీరు ప్రజల దాహార్తిని తీర్చనున్నదని చెప్పారు. ఆండ్ర జలాశయం వద్ద ప్రారంభమైన నీటి ప్రవాహం పిట్టాడా, మెంటాడ, కుదిపి, మీదుగా రామతీర్థాలు, నెల్లిమర్ల పంప్ హౌస్ ల వద్దకు చేరుతుంది. గత రెండు విడతలగా ఆండ్ర నుంచి 50 క్యూసెక్కులు చొప్పున 100 క్యూసెక్కులు నీటి విడుదల జరిగిందని, ప్రస్తుతం మూడో విడత మరోసారి నీరు విడుదలవుతుందని వెల్లడించారు.

# కాజ బ్లాక్ ను 'వేదాంత-కు ఇవ్వొద్దు

అమరావతి బ్యూరో : (సువార్త ప్రతినిధి): ఓఎన్‌జిసి డ్రిల్లింగ్ చేసి, చమురు, సహజవాయువు వెలికితీసే కాజబ్లాక్‌ను "వేదాంత" కార్పొరేట్ కంపెనీకి అప్పగించొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కమిటి కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు లేఖ రాశారు. కాజబ్లాక్‌ను వేదాంత కార్పొరేట్ కంపెనీకి అప్పగిస్తున్నట్టు మీడియాలో చూసి ఆశ్చర్యపోయినట్టు ఈ లేఖలో ఆయన పేర్కొన్నారు. అంత విలువైన జాతీయ సంపదను ఒక ప్రయివేటు సంస్థకు అప్పగించడం న్యాయం కాదని, అది రాష్ట్ర పురోగతికి తీవ్ర నష్టం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రభుత్వమే స్వాధీనం చేసుకొని నిర్వహించాలని కోరారు. కృష్ణా జిల్లాలోని మొవ్వ, గూడూరు, మచిలీపట్నం, పామర్రు పరిసర ప్రాంతాల్లో ఓఎన్‌జిసి డ్రిల్లింగ్ చేసి కనుగొన్న తరువాత 114.93 చదరపు కిలోమీటర్ పరిధిలోనున్న చమురు సహజవాయువు కాజబ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం నిర్వహించకుండా ప్రయివేటు కంపెనీకి అప్పగించడం సహేతుకం కాదని తెలిపారు. దానికి కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ, రాష్ట్ర ప్రభుత్వం అన్ని అనుమతులు ఇవ్వడం అంటే విలువైన రాష్ట్ర సంపదను ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టడమేనని పేర్కొన్నారు. ఒకవైపు పెట్రోలు,




డీజిల్ ధరలు అంతర్జాతీయంగా పెరిగాయని, కంపెనీలకు నష్టం వస్తుందని చెప్పి ప్రజలపై భారాలు వేస్తున్నారని తెలిపారు. మరోవైపు మన రాష్ట్రంలో చమురు సహజవాయువును వెలికితీసే కెజి బేసిన్ వంటివి ఇప్పటికే ప్రయివేటు, కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పడం వల్ల సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు కంపెనీలు అధిక లాభాలకు అమ్ముకొని రాష్ట్ర ప్రయోజనాలను, అవసరాలను నిర్లక్ష్యం చేస్తున్నాయని పేర్కొన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరతను ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఆ పేరుతో ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపుతున్నారని, మరో వైపు చమురు, గ్యాస్ నిక్షేపాలను రాష్ట్రానికి దక్కకుండా పోతున్నాయని తెలిపారు. ఇదే ప్రభుత్వం నిర్వహిస్తే ప్రజలకు చౌకగా ఇవ్వడమే కాకుండా ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని, దీనిని రాష్ట్రాభివృద్ధికి వినియోగించవచ్చునని సూచించారు. ఈ ప్రాజెక్టు నిర్వహణలో కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉందని తెలిపారు. వేదాంత కార్పొరేట్ కంపెనీ కాలుష్య నివారణ చర్యలు తీసుకోక తమిళనాడు తూత్తుకుడి, ఒరిస్సా బాక్సైట్‌లలో జరిగిన ప్రజా ప్రతిఘటనలు, కాల్పులు మన కళ్ల ముందున్నాయని తెలిపారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని వేదాంత కంపెనీకి కాజబ్లాక్‌ను ఇవ్వకుండా చమురు, సహజ వాయువు వెలికితీసే బాధ్యత ప్రభుత్వమే తీసుకొని నిర్వహించాలని కోరారు.

# హమాలీల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

మార్టూరు (బాపట్ల) :(సువార్త ప్రతినిధి): సివిల్ సప్లయిస్ పాయింట్లలో దినసరిగా కూలీలుగా పనిచేస్తున్న హమాలీల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుందని సిఐటియు బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల హనుమంతరావు విమర్శించారు. హమాలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మార్టూరు పెద్ద మార్కెట్ ఆవరణలో ఉన్న సివిల్ సప్లయిస్ గోడౌన్ వద్ద హమాలీలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. బత్తుల హనుమంతరావు మాట్లాడుతూ.. నేటి వరకు ఏప్రిల్ నెల బిల్లులు చెల్లించలేదని తెలిపారు. దినసరి కూలీలుగా పనిచేస్తున్న హమాలీలకు బిల్లులు చెల్లించకుండా అధికారులు కాలయాపన చేస్తుంటే వారు ఎలా



జీవించాలని ప్రశ్నించారు. హమాలీలకు కూలి రేట్లు ఒప్పందం గత సంవత్సరం డిసెంబర్ 31 తో ముగిసి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ నేటికీ కూలీ రేట్లు పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కాలయాపన చేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా హమాలీలకు ప్రతి నెల 5 వ తేదీ న హమాలీల బిల్లులు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

# ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

అమరావతి బ్యూరో :(సువార్త ప్రతినిధి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం జరిగిన పరీక్షకు మొదటి సంవత్సరం విద్యార్థులు 93.40శాతం హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 80,728 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, వారిలో 75,400 మంది పరీక్ష రాశారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 40,703 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 36,350 (89.75శాతం) మంది హాజరయ్యారు. ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి పి రంజిత్ బాషా విజయవాడ పరిధిలోని శస్త్ర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ప్రకాశం జిల్లాకు చెందిన విద్యార్థి అక్రమాలకు పాల్పడుతూ పట్టుబడటంతో నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఇంటర్మీడియట్ బోర్డు గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది.

# షాపూర్జీ పల్లోంజి పైపులకు మంటలు

గుంటూరు సిటీ, (సువార్త ప్రతినిధి): గుంటూరు నగర శివారులో నిల్వ ఉంచిన భారీ పైపుల్లో మంటలు చెలరేగాయి. భూగర్భ డ్రైనేజ్ పనుల కోసం ప్రముఖ నిర్మాణ సంస్థ షాపూర్జీ పల్లోంజి వీటిని తీసుకొచ్చినట్టు సమాచారం. అగ్నికీలలతో ఉదయం టీచర్స్ కాలనీ పరిసరాల్లో దట్టమైన పొగ కమ్ముకుంది. మంటలు వేగంగా వ్యాపించడంతో సమీప కాలనీల ప్రజలు భయంతో పరుగులు తీశారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది కొన్ని గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. లేకపోతే మంటలు సమీప కాలనీలకు వ్యాపించి



పెనుప్రమాదం సంభవించేదని అధికారులు తెలిపారు. భారీ పైపులు కావడంతో నష్టం రూ.కోట్లలో ఉండొచ్చని ప్రాథమిక అంచనా. ఏఎస్పీ(అడ్మిన్) జి.వి.రమణమూర్తి, గుంటూరు జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి ఎం.శ్రీనివాసరెడ్డి తదితరులు పరిస్థితిని సమీక్షించారు. (

# చదివేది డిగ్రీ.. చేసేది గంజాయి రవాణా



చీపురుపల్లి, (సువార్త ప్రతినిధి): బ్రహ్మపూర్ నుంచి విశాఖపట్నం వెళుతున్న రైలులో విజయనగరం జిల్లా చీపురుపల్లి పోలీసులు సోదాలు నిర్వహించి 14 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేరళకు చెందిన కొడవలం దేవీనాథ్, ఏదోతా పటమాటు జోసెఫను అరెస్ట చేశారు. చీపురుపల్లి సీఐ జి.శంకరరావు కథనం మేరకు.. కేరళ రాష్ట్రం కసర్‌గాడ్ జిల్లా కొడవలం గ్రామానికి చెందిన దేవీనాథ్, ఎర్నాకుళం జిల్లా వట్టటుపరకు చెందిన జోసెఫ్ చెడు అలవాట్లకు బానిసలై, తప్పుడు మార్గంలో డబ్బులు సంపాదించాలనుకున్నారు. ఈ క్రమంలో ఒడిశాలోని బరంపురానికి చెందిన రాహుల్ నుంచి గంజాయి కొనుగోలు చేశారు. ఈ గంజాయిని బ్రహ్మపూర్ నుంచి విశాఖ వెళ్లే పాసింజర్ రైలులో తరలించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా పెట్టిన పోలీసులు.. చీపురుపల్లి స్టేషన్‌లో అదే రైలు ఎక్కారు. అనుమానాస్పదంగా కనిపించిన బ్యాగులు తనిఖీ చేయగా 14 గంజాయి బయటపడింది. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, గంజాయితో పాటు రెండు సెల్ ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరూ సైబర్ ఫోరెన్సిక్, కంప్యూటర్ సైన్సు ఫైనలియర్ విద్యార్థులని పోలీసులు తెలిపారు. కాగా.. రైల్లో చీపురుపల్లి పోలీసులు గురువారం నిర్వహించిన తనిఖీల్లో నార్కోటిక్ డాగ్ రుద్ర గంజాయి తరలిస్తున్న వ్యక్తులను గుర్తించింది. పోలీసులు అప్రమత్తమై నిందితులను అరెస్ట్ చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

# కార్మిక కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం



భీమవరం టౌన్ (సువార్త ప్రతినిధి): పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం కొవ్వాడ అన్నవరంలోని ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లో రాత్రి జరిగిన ప్రమాదంలో మరణించిన వలుపు వెంకన్న (45) కుటుంబానికి రూ.10 లక్షలు నష్ట పరిహారం అందించేందుకు యాజమాన్యం అంగీకరించింది. సిపిఎం, సిఐటియు అండతో ఇది సాధ్యమైందని కార్మిక కుటుంబాలు స్పష్టం చేశాయి. బుధవారం రాత్రి ప్రమాదం జరిగిన వెంటనే పక్కనే ఉన్న రాజర్షి ఆసుపత్రికి ముగ్గురు కార్మికులను తరలించారు. వారిలో వెంకన్న మృతి చెందగా, మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. మృతుని కుటుంబానికి పరిహారం ఇవ్వకుండానే పంపించే యత్నాల్లో యాజమాన్యం ఉందని తెలిసి సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావుతోపాటు వివిధ కార్మిక సంఘాల నేతలు వరలక్ష్మి, లారెన్స్ కుమారిడ హాస్పిటల్ వద్దకు చేరుకున్నారు. నష్ట పరిహారం చెల్లించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం చేయించాలని డిమాండ్ చేశారు. ఆ సమయంలో పోలీసుల తీరు విమర్శల పాలైంది. భీమవరం డిఎస్‌పి రఘువీర్ విష్ణు నేతలతో చర్చించే ప్రయత్నం చేయకుండా దౌర్జన్యంగా సిపిఎం నాయ కులు, మృతుల కుటుంబ సభ్యులను పక్కకు నెట్టి, సిఐటియు నేతలను బలవంతంగా అదుపులోకి తీసుకుని వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. పోస్టుమార్టానికి మృతుని కుటుంబ సభ్యులు నిరాకరించారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సంఘటన స్థలమైన సత్యనారాయణ రైస్ మిల్ ప్రధాన గేటు వద్ద సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. దీంతో టూటౌన్ సిఐతో పాటు మున్సిపల్, రెవెన్యూ, పరిశ్రమల అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని యాజమాన్యంతో, మృతుని కుటుంబ సభ్యులతో పలు దఫాలు చర్చలు జరిపారు. మృతుని కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించింది. బి.వాసుదేవరావు మాట్లాడుతూడ బాధితుల పక్షాన సిపిఎం, సిఐటియు పోరాటం చేశాయని, యాజమాన్యం దిగొచ్చి మృతుని కుటుంబానికి రూ.పది లక్షలు పరిహారంతోపాటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు కార్మికులకు మెరుగైన వైద్యం అందించేందుకు అంగీకరించిందని తెలిపారు.

# కరెంటు వాడకంలో రికార్డు!



అమరావతి, (సువార్త ప్రతినిధి): మండుతున్న ఎండలతో రాష్ట్రం నిప్పుల కుంపటిగా మారింది. ప్రజలు దాదాపుగా ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఎండల తీవ్రతకు అనుగుణంగా గృహ వినియోగం భారీగా ఉండటంతో రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ గత రెండు రోజులుగా గణనీయంగా పెరిగింది. రాష్ట్ర విద్యుత్తు శాఖ చరిత్రలోనే రికార్డు స్థాయిలో 285 మిలియన్ యూనిట్ల వినియోగం నమోదైంది. బుధవారం 278.9 ఎం.యూ. విద్యుత్తు వినియోగించారు. గతేడాది ఏప్రిల్, మే నెలల్లో గరిష్ఠంగా 256 ఎంయూ వినియోగం మాత్రమే నమోదైంది. ఈ ఏడాది మార్చి 7న గరిష్ఠంగా 274.6 ఎంయూలు వినియోగించారు. మార్చి ప్రారంభం నుంచే ఉష్ణోగ్రతలు 35డిగ్రీల పైబడడం విద్యుత్తు వినియోగం భారీగా పెరగడానికి కారణమని అధికారులు అన్నారు. గత ఐదేళ్లలో ఏప్రిల్, మే నెలల్లో గరిష్ఠ విద్యుత్తు వినియోగం సగటున 256 మిలియన్ యూనిట్లు మాత్రమే. దీని ఆధారంగా ఈ ఏడాది మేలో గరిష్ఠ డిమాండ్ 280 ఎంయూ ఉండొచ్చని అంచనా వేయగా, గురువారం 285 ఎంయూను తాకింది. ఇదే పరిస్థితి కొనసాగితే మే నెలాఖరు నాటికి 300 ఎంయూలకు చేరినా ఆశ్చర్యం లేదని అధికారులు చెబుతున్నారు. అంచనాలకు మించి వినియోగం జరుగుతున్నా ఎక్కడా అంతరాయాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జెన్కో ఆధ్వర్యంలోని థర్మల్, హైడల్ కేంద్రాలు రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి చేస్తున్నాయి.

# పౌల్ట్రీ పరిశ్రమకు వడదెబ్బ





(సువార్త ప్రతినిధి)::పౌల్ట్రీ పరిశ్రమకు వేసవి దెబ్బ తగిలింది. ఎండ వేడికి తట్టుకోలేక ప్రతిరోజు లక్షలాది కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు రోజులుగా సుమారు పది లక్షల కోళ్లు మృత్యువాత పడినట్లు పౌల్ట్రీ రైతులు చెబుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత కారణంగా భారీ సంఖ్యలో కోళ్లు చనిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా లేయర్ ఫారాల్లో వేడి ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. గాలి వెళ్లే మార్గాలు లేకపోవడం, తాగునీటి కొరత, విద్యుత్ అంతరాయం కూడా కోళ్ల మరణాలకు కారణంగా భావిస్తున్నారు. వేసవిలో కోళ్లు బరువు తగ్గడం, మేత తినకపోవడం, గుడ్ల ఉత్పత్తి తగ్గడం తదితర కారణాలతో పరిశ్రమ నష్టాల బారిన పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని కోళ్ల ఫారాల్లో సుమారు కోటీ 20 లక్షల కోళ్లు ఉన్నాయి. వాటిలో 90 లక్షల వరకు గుడ్డు ఉత్పత్తి అవుతుంది. ఎక్కువగా గుడ్లు ఉత్పత్తి చేసే కోళ్లు చనిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. అధిక ఉష్ణోగ్రత ప్రభావం బర్డ్‌ఫ్లూ కంటె ఎక్కువగా నష్టం కలిగిస్తోందని వాపోతున్నారు. చనిపోయిన కోళ్లను గొయ్యితీసి పాతిపెడుతున్నారు. కోళ్లకు బీమా చేయించుకునే పరిస్థితి ఉండేది. బీమా చేసే కంపెనీల ఆంక్షలు, భారీ ప్రీమియంతో రైతులు ఆసక్తి చూపడంలేదు. కోట్లు పెట్టుబడి పెట్టి బీమా చేయించినా అవసరమైనపుడు బీమా కంపెనీలు పలు కొర్రీలతో క్లెయిమ్ ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు.

వేసవిలో అదనపు ఖర్చు

వేసవిలో పౌల్ట్రీ నిర్వహణకు సాధారణ రోజులకంటే అదనపు ఖర్చు అవుతోంది. షెడ్డులకు చల్లని వాతావరణం కల్పించడానికి స్పింక్లర్లు, షెడ్డులపై గడ్డి, చల్లని నీరు, షెడ్డుల చుట్టు గోనె సంచుల ఏర్పాటు, వాటిని తడపడం, విద్యుత్, జనరేటర్‌లు, రిపేర్లకు అధిక మొత్తం వెచ్చించాల్సి వస్తోంది.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..

ఫారాల్లో ఎగ్జాస్ట్ ఫ్యాన్లు, కూలింగ్ ప్యాడ్లు ఏర్పాటు చేసుకోవాలి. పైకప్పులకు నీటిని చల్లడం ద్వారా ఉష్ణోగ్రతలు తగ్గించాలి. కోళ్లకు చల్లటి తాగునీరు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలి. ఎలాక్ట్రలైట్సు, విటమిన్ సప్లిమెంట్స్ ఇవ్వాలి. మధ్యాహ్న వేళల్లో మేత తగ్గించి, ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే మేత వేయాలి. ఫారాల్లో గాలి ప్రసరణ మెరుగుపర్చాలి. విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలి. జనరేటర్లు సిద్ధంగా ఉంచుకోవాలి.

ప్రభుత్వం ఆదుకోవాలి

వేసవి తీవ్రతతో నష్టపోతున్న పౌల్ట్రీ రైతులకు ప్రభుత్వం ప్రత్యేక సాయం ప్రకటించాలి. విద్యుత్ రాయితీలు, మేత సబ్సిడీ, అత్యవసర వైద్య సేవలు అందించాలి.

# సచివాలయ సిబ్బంది కొరత !




ఆత్మకూరు (అనంతపురం) (సువార్త ప్రతినిధి):ఆత్మకూరు మండల వ్యాప్తంగా పంచాయతీలోని గ్రామ సచివాలయంలో అసలు సేవలు ప్రజలకు అందుతున్నాయా ? లేదా ? అనే సందేహం ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది లేక ప్రజలు ప్రభుత్వ పథకాలు పెట్టుకోవటానికి అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల స్థలాలు, క్యాస్ట్ ఇన్కమ్ సర్టిఫికెట్ వన్ బి అడంగల్ కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు ఇతర సేవలకు సచివాలయాల చుట్టూ తిరిగి ప్రజలు అలసిపోతున్నారు. సచివాలయానికి సిబ్బంది లేక తాళాలు వేస్తున్న పరిస్థితి నెలకొంది. సచివాలయంలో సిబ్బంది లేక, ప్రజలకు సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టరా ? ప్రజలకు సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోరా ? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ మధ్యలో సచివాలయ ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్ తర్వాత గ్రామ పంచాయతీలో ఏర్పడిన సిబ్బంది కొరత నేటి వరకు అదే పరిస్థితి కొనసాగుతుంది. గ్రామ పంచాయతీలో ఉన్న అన్ని సచివాలయాల పరిస్థితి దాదాపు అంతే. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి, సిబ్బంది కొరతకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# రాష్ట్రం అగ్నిగుండం!




(సువార్త ప్రతినిధి): భానుడి భగభగలకు రాష్ట్రం అగ్నిగుండంలా మారింది. వడదెబ్బకు రాష్ట్రవ్యాప్తంగా 17 మంది మరణించారు. గురువారం ఉదయం నుంచే ఎండలు తారెత్తించాయి. తీవ్ర వడగాడ్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మూగజీవాలు సైతం ఎండకు తాళలేక నీడ కోసం చెట్ల కిందకు చేరాయి. రోహిణి కార్తె రాక ముందే రాష్ట్రంలో రోళ్లు పగిలేలా ఎండలు కాస్తున్నాయి. థార్ ఎడారి నుంచి వేడి గాలులు వాయువ్య, మధ్యభారతం మీదుగా కోస్తాంధ్ర, రాయలసీమ వరకు వీస్తున్నాయి. రుతుపవన ముందస్తు వర్షాలు తగ్గడం, ఉత్తరాదిలో వెస్టర్న్ డిస్టబెన్స్ ప్రభావం లేకపోవడంతో ఎడారి గాలుల్లో తేమశాతం గణనీయంగా తగ్గింది. దీంతో తీవ్రమైన వడగాడ్పులకు రాష్ట్రం నిప్పులకొలిమిలా మారింది. ఉదయం ఏడు గంటల నుంచే సూర్యకిరణాలు నేరుగా భూమిని తాకడం, ఆకాశం నిర్మలంగా ఉండడంతో భరించలేని ఎండ కాసింది. కోస్తాలో తేమ ఎక్కువగా ఉండి ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. మిగిలిన ప్రాంతాల్లో గాలిలో తేమ శాతం పడిపోయి, పొడిగాలులు తీవ్రత పెరిగింది. దీంతో అనేక ప్రాంతాలు మధ్యాహ్నానికి అగ్నిగుండంలా మారాయి. ఇళ్లల్లోనూ వేడి తీవ్రతకు జనం తాళలేకపోయారు. ఏసీల వినియోగం భారీగా పెరిగింది. 60 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 219 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. 18 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా, అన్ని జిల్లాల్లోనూ 44 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 200 చోట్ల 44 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత నమోదైంది. మార్కాపురం జిల్లా కనిగిరిలో అత్యధికంగా 48.3 డిగ్రీలు, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 48.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వడగాడ్పులకు ఏలూరు జిల్లాలో నలుగురు, ప్రకాశం జిల్లాలో ముగ్గురు, నెల్లూరు, విజయనగరం, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఇద్దరు చొప్పున, కృష్ణా, నంద్యాల, పశ్చిమగోదావరి, కాకినాడ జిల్లాల్లో ఒక్కొక్కరు మరణించారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో ఎండవేడిమికి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంటలు చెలరేగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అలాగే, ఎండ వేడికి తట్టుకోలేక ప్రతిరోజూ లక్షలాది కోళు మృత్యువాత పడుతున్నాయి. తూర్పుగోదావరి జిల్లా మండపేట మండలం వేములపల్లిలోని ఒక కోళ్ల ఫారంలో గురువారం 200 కోళ్ల వరకూ చనిపోయాయి. దాదాపు అన్ని కోళ్లఫారాల్లోనే ఇదే పరిస్థితి నెలకొంది.

నేడు ఏ జిల్లాలో ఎంత ఉష్ణోగ్రత?

శుక్రవారం 15 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 219 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అల్లూరి, పోలవరం, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లో 45–47 డిగ్రీలు, కాకినాడ, నెల్లూరు జిల్లాల్లో 43–45, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, విశాఖ, అనకాపల్లి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 40–43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఉండొచ్చని పేర్కొంది. కాగా, ఈనెల 26 వరకు అనేకచోట్ల వడగాడ్పులు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తాంధ్రలో తీవ్రమైన వడగాడ్పులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

పిడుగుపడి వ్యక్తి మృతి

దక్షిణ ఒడిశా పరిసరాల్లో ఆవరించిన ఉపరితల ఆవర్తనం, మధ్య బంగాళాఖాతం నుంచి తమిళనాడు మీదుగా నైరుతి బంగాళాఖాతం వరకు విస్తరించిన ఉపరితలద్రోణి ప్రభావంతో గురువారం అక్కడక్కడ పిడుగులతో వర్షాలు కురిశాయి. విజయనగరం జిల్లా వేపాడ మండలం సోంపురంలో పిడుగుపడి ఒక వ్యక్తి మృతి చెందారు. మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది.

తిరుమలలో భానుడి భగభగలు

తిరుమలలో ఎండ తీవ్రత అధికంగా ఉంది. కిలోమీటర్ల కొద్దీ రద్దీ, భానుడి సెగలతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం పాదరక్షలు లేని భక్తులు కాలుతున్న నేలపై నడవలేక పరుగులు తీస్తున్న దృశ్యాలు కనిపించాయి. నాలుగు మాడవీధులను ట్యాంకర్ల నీటితో తడుపుతున్నా కాసేపటికే ఆవిరైపోతోంది. దీంతో భక్తులు కూలింగ్ పెయింట్, రెడ్‌కార్పెట్‌పై త్వరత్వరగా నడుస్తూ షెడ్ల కిందకు చేరుకుంటున్నారు.

# అర్ధరాత్రి యువకుల హల్‌చల్.. పోలీసుల కేసు నమోదు

విజయవాడ, (సువార్త ప్రతినిధి): విజయవాడ నగరంలోని పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో యువకులు రెచ్చిపోయారు. స్థానిక హై టెన్షన్ లైన్ రహదారిపై రెండు వర్గాలకు చెందిన యువకులు తమ కార్లతో ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. ఒకరినొకరు కార్లతో ఢీకొట్టుకుంటూ హల్‌చల్ చేశారు. గురువారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యాదీంతో పోలీసులకు సమాచారం అందించారు. సీఐ పవన్ కిషోర్ అక్కడికి చేరుకుని.. ఇరు వర్గాలకు చెందిన యువకులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వాటర్ ట్యాంకర్లకు పెరిగిన డిమాండ్




హైదరాబాద్: మే 22(సువార్త ప్రతినిధి): నగరంలో తాగునీటి కష్టాలు అధికమయ్యాయి. భానుడి భగభగలకు భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో కొండాపూర్‌లో నీటి సరఫరాకు డిమాండ్ పెరిగింది. తాగునీటి కష్టాలను అధిగమించేందుకు ప్రజలు ట్యాంకర్లను బుక్ చేసుకుంటున్నారు. కొండాపూర్ డివిజన్‌లోని తులీప్ కమ్యూనిటీ, మసీద్‌బండ వద్ద ఉన్న రెండు ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నుంచి జలమండలి అధికారులు అర్ధరాత్రి 12 గంటల వరకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు.

ఆరింతలు రెట్టింపు..

కొండాపూర్ డివిజన్‌లో వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ బాగా పెరిగింది. ఓవర్‌హెడ్ ట్యాంకులకు ఇన్‌పుట్ తగ్గడం, అవుట్‌పుట్ పెరగడంతో నీటి సరఫరాలో అంతరాయం పెరుగుతుంది. రెండు నెలల క్రితం ఒక్కో పాయింట్ వద్ద ప్రతీ రోజు 40నుంచి 60 ట్యాంకర్లు బుకింగ్ అయ్యేవి. ప్రస్తుతం ఎండలు ముదిరిపోవడంతో డిమాండ్ పెరిగి ఒక్కో పాయింట్ వద్ద 200 నుంచి 350 ట్యాంకర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. అంటే గడిచిన రెండు నెలల్లో ట్యాంకర్లకు ఆరింతల డిమాండ్ పెరిగిందన్నమాట. మరో నెల రోజులు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉందని జలమండలి అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ట్యాంకర్లకు డిమాండ్ పెరగడంతో ఇంటింటికీ నల్లాల ద్వారా సరఫరా చేసే నీటిని 40నిమిషాలకు కుదించారు. కాలనీ వాసులకు నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మొత్తం మీద వేసవికాలం ముగిసే వరకు ఈ నీటి తిప్పలు తప్పేలా లేవు.ప్రాధాన్యం ఇస్తున్నాం

నెల రోజుల నుంచి వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ బాగా పెరిగింది. రాత్రి 12 గంటల వరకు ట్యాంకర్ల నీటిని సరఫరా చేస్తున్నాం. అన్ని కాలనీలకు, అపార్టుమెంట్లకు సమప్రాధాన్యం ఇస్తూ నీటి సరఫరాను నియంత్రిస్తున్నాం. అయితే ప్రజలు కూడా సహకారం అందించాలి. ముఖ్యంగా నీటిని వృథా చేయకుండా అవసరమైన మేరకు మాత్రమే వాడుకోవాలి. నల్లాలకు రోజు విడిచి రోజు 40 నిమిషాల పాటు మాత్రమే సరఫరా చేస్తున్నాం.

నీటి సరఫరాలో తీవ్రమైన ఇబ్బంది ఎదురవుతోంది. ట్యాంకర్లను బుక్ చేసినప్పటికీ కొన్ని సార్లు రావడం లేదు. ట్యాంకర్లపై అధికారుల నియంత్రణ ఉండాలి. ఒక్కోసారి బుక్ చేయని వారికి కూడా నీటిని సరఫరా చేస్తున్నారు. బ్లాక్‌మార్కెట్‌కు తరలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రజలు కూడా నీటి వాడకాన్ని సాధ్యమైనంత వరకు నియంత్రించాలి.

# కొత్త రైళ్లలో గంటల కొద్దీ ప్రయాణం !



హైదరాబాద్ సిటీ: మే 22(సువార్త ప్రతినిధి): గంటకు 300 కిలోమీటర్ల వేగంతో బుల్లెట్ రైళ్లను తీసుకు వస్తున్నట్లు ఇటీవల రైల్వేమంత్రి చేసిన ప్రకటనకు, తాజాగా దక్షిణ మధ్య రైల్వే రెండు కొత్తరైళ్లను ప్రారంభిస్తున్నట్లుగా ఇచ్చిన ప్రకటనకు పొంతన కుదరడం లేదు. 300కిలోమీటర్ల వేగం సంగతి అలా ఉంచితే.. 130 నుంచి 160 కిలోమీటర్ల వేగాన్ని తట్టుకునే సామర్థ్యంతో అధునాతన రైల్వేలైన్లను నిర్మించామంటున్న రైల్వే అధికారులు గంటకు 50కిలోమీటర్ల కంటే వేగంతో కొత్త రైళ్లను నడపలేమని చేతులెత్తేయడం విడ్డూరంగా ఉంది.తాజాగా చర్లపల్లి నుంచి భువనేశ్వర్‌కు ఈ నెల 25న, అటు తిరుపతికి ఈ నెల 29న రెండు కొత్తరైళ్లను దక్షిణ మధ్యరైల్వే ప్రకటించింది. చర్లపల్లి నుంచి శుక్రవారం సాయంత్రం 4.20గంటలకు 17444 రైలు తిరుపతికి శనివారం ఉదయం 7.30కు చేరుతుందని చెబుతోంది. తిరుగు ప్రయాణంలో ప్రతి తిరుపతి నుంచి సాయంత్రం 4.30గంటలకు బయల్దేరే 17443 రైలు శుక్రవారం ఉదయం 8.25గంటలకు చర్లపల్లికి చేరుతుందని అధికారులు ప్రకటన జారీచేశారు. దీంతో కేవలం 750 కిలోమీటర్ల ప్రయాణం 15నుంచి 16గంటల వరకు పడుతోంది.చర్లపల్లి–తిరుపతి (వయా పిడుగురాళ్ల, మార్కాపురం)మార్గంలో ఇంతకు ముందు నడిపిన 07001/07002 ప్రత్యేక రైళ్లను తాజాగా రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్‌లుగా ప్రవేశపెడుతున్నట్లు రైల్వే అధికారులు గురువారం వెల్లడించారు. ఆయా రైళ్లకు గతంలో ఉన్న కొన్ని స్టాపుల గురించి తాజాగా పేర్కొనలేదు. 07001 ప్రత్యేక రైలుకు గతంలో వినుకొండ, దొనకొండ రైల్వేస్టేషన్లలో హాల్ట్ ఉండగా, రెగ్యులర్ ఎక్స్‌ప్రెసకు ఆయా స్టేషన్లలో హాల్ట్‌ల గురించి మరిచిపోయారా లేదా ఉద్దేశపూర్వకంగానే ఎత్తివేశారా అని ప్రయాణికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. హాల్ట్‌ల విషయమై దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌ఓ శ్రీధర్‌ను ' వివరణ కోరగా, సంబంధిత విభాగం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

# సంతానలేమి చికిత్సకు ఇల్లుగుల్ల!



హైదరాబాద్, మే 22(సువార్త ప్రతినిధి): దేశంలో సంతానలేమి (ఇన్‌ఫెర్టిలిటి) సమస్య ఎదుర్కొంటున్న దంపతులకు వైద్య ఖర్చులు మోయలేని భారంగా మారుతున్నాయి. ఈ చికిత్స కోసం వారు వెచ్చిస్తున్న మొత్తం, వారిని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెడుతోంది. ఈ మేరకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) పరిధిలోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఇన్ రిప్రొడక్టివ్ అండ్ చైల్డ్ హెల్త్' (ఎన్ఐఆర్ఆర్‌సీహెచ్) అధ్యయనం వెల్లడించింది. దేశంలోని ఐదు ప్రధాన తృతీయ శ్రేణి (టెర్షియరీ) ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న దంపతులపై నిర్వహించిన ఈ పరిశోధనలో పలు విషయాలు బయటపడ్డాయి. కుటుంబ ఆహారేతర వార్షిక ఖర్చులలో 40 శాతం కన్నా ఎక్కువ కేవలం వైద్యానికే ఖర్చయితే, దాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నిబంధనల ప్రకారం 'కటస్ట్రోఫిక్ హెల్త్ ఎక్స్‌పెండిచర్' (తీవ్ర ఆర్థిక నష్టం కలిగించే ఖర్చు)గా పరిగణిస్తారు. సంతానలేమి చికిత్స తీసుకుంటున్న వారిలో 59.4 శాతం దంపతులు ఇటువంటి తీవ్ర ఆర్థిక భారాన్ని మోస్తున్నారని ఎన్ఐఆర్ఆర్‌సీహెచ్ అధ్యయనం పేర్కొంది. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ సగటు ఖర్చు రూ.14,217గా ఉంటే, అదే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇది రూ.8,355గా నమోదైంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స ఖర్చు తక్కువగా ఉన్నప్పటికీ, అక్కడ కొన్ని రకాల మందులు అందుబాటులో లేకపోవడం వల్ల రోగులు వాటిని బయట కొనుగోలు చేయాల్సి వస్తోందని నివేదిక పేర్కొంది. ఇక వివిధ రకాల శారీరక సమస్యల ఆధారంగా ఖర్చులు మారుతున్నట్లు అధ్యయనంలో గుర్తించారు. వార్షిక సగటు ఎండోమెట్రియోసిస్ రూ.16,943 (అత్యధిక ఖర్చు), గర్భాశయ సమస్యలు రూ.14,605, పురుషుల్లో వంధ్యత్వ చికిత్సకు రూ.16,566, పీసీవోఎస్ రూ.13,020గా ఉంది. ఈ ఖర్చుల్లో ప్రధానంగా మందులు, డయాగ్నోస్టిక్స్ (అల్ట్రాసోనోగ్రఫీ, హెచ్ఎస్జీ, ల్యాప్రోస్కోపీ) వంటి వైద్య పరీక్షల ఖర్చులు ఎక్కువగా ఉంటున్నాయి. ఇంట్రా యుటెరైన్ ఇన్‌సెమినేషన్ (ఐయుఐ) ప్రక్రియ చేయించుకున్న వారిలో ఖర్చులు మరింత పెరుగుతున్నాయి. కాగా దేశంలో సంతానలేమి కేవలం శారీరక సమస్యే కాకుండా తీవ్రమైన సామాజిక, మానసిక ఒత్తిడికి కారణమవుతోంది. ఆయుష్మాన్ భారత్ వంటి ప్రభుత్వ బీమా పథకాల పరిధిలోకి ఓపీడీ ఆధారిత సంతానలేమి పరీక్షలను, మందులను తీసుకురావాల్సిన అవసరం ఉందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.

భద్రత లేని బీమా

దేశంలో సంతానలేమి సమస్యలు ఎదుర్కొంటున్న వారిలో దాదాపు 17.5శాతం ఉన్నప్పటికీ, ఈ సమస్యను జాతీయ ఆరోగ్య మిషన్ లేదా ఆర్.ఎమ్.ఎన్.సి.హెచ్+ఏ వంటి ప్రధాన ప్రభుత్వ ఆరోగ్య పథకాల్లో చేర్చలేదు. అధ్యయనంలో పాల్గొన్న దంపతుల్లో ఒక్క శాతానికి మాత్రమే ఆరోగ్య బీమా రక్షణ ఉంది. ఇన్సూరెన్స్ లేకపోవడం వల్ల ఖర్చులు భరించలేక 44శాతం దంపతులు అప్పులు లేదా లోన్లు తెచ్చి చికిత్స చేయించుకుంటున్నట్లు వెల్లడైంది. వార్షిక ఆదాయం రూ.59,400 కంటే తక్కువ ఉండి, ఇతర ఆరోగ్య సమస్యలు (బీపీ, షుగర్, థైరాయిడ్) ఉన్న దంపతులు ఈ ఖర్చుల వల్ల మరింత కుంగిపోతున్నారు.

# 'అనంత'మైన ఆస్తులు..

## సంపాదనంతా ఉద్యోగంలో చేరాకే!



హైదరాబాద్ సిటీ: మే 22(సువార్త ప్రతినిధి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఇటీవల పట్టుబడిన వాటర్‌బోర్డు జనరల్ మేనేజర్ అనంత లక్ష్మీకుమార్‌కు బోర్డులో ఉలుకరూ.. పలుకరూ అనే పేరుంది. తన విభాగంలో పని చేసేవారితో తప్పా, ఇతరులతో మాట్లాడేవారు కాదట. ముడుపు దక్కితే కానీ, ఫైల్ కదిపేవారు కాదని కాంట్రాక్టర్లు అంటున్నారు. ఆయన ఆస్తులన్నీ ఉద్యోగంలో చేరాకే సంపాదించినట్లుగా ఏసీబీ అధికారులు గుర్తించినట్లు సమాచారం.1991లో అనంత లక్ష్మీకుమార్ వాటర్‌బోర్డులో టెక్నికల్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగంలో చేరారు. ఆ తర్వాత జేఎన్‌టీయూ నుంచి బీటెక్, ఎంటెక్ డిగ్రీలు పూర్తి చేశారు. 2003లో మేనేజర్‌గా పదోన్నతి పొందారు. 2010లో సికింద్రాబాద్‌లోని మారేడుపల్లిలో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొందారు. ఆపరేషన్ మెయింటనెన్స్ విభాగంలో పని చేశారు. 2021లో జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొందగా.. ప్రాజెక్టు డివిజన్‌లో పనిచేస్తున్నారు. జనరల్ మేనేజర్ అంటే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) అన్నమాట.పనుల ప్రతిపాదన దగ్గర నుంచి పూర్తి చేయించే వరకు పూర్తిగా ఆయనదే బాధ్యత. తమకు అనుకూలమైన కాంట్రాక్టర్లకు పనులు వచ్చేలా తెరవెనుక పావులు కదిపేవారని తెలిసింది. రెడ్‌హిల్స్ ప్రాజెక్టు డివిజన్ జీఎంగా పనిచేస్తున్న కుమార్ కార్వాన్, నాంపల్లి, ఖైరతాబాద్, బంజారాహిల్స్ పరిధిలో జరుగుతున్న సీవరేజ్ నెట్‌వర్క్ విస్తరణ పనుల్లో కీలకంగా పని చేస్తున్నారు. ఈ పనుల్లో ప్రముఖ నిర్మాణ సంస్థకు అనుకూలంగా వ్యవహరించినట్లు తెలిసింది.దాంతో పాటు పలు తాగునీటి పైపులైన్లు, సీవరేజ్ నెట్‌వర్క్ పనుల్లో కాంట్రాక్టర్లు ముడుపులు చెల్లించేంత వరకు ఫైల్ కదిలించకపోయేదని సమాచారం. కుమార్ భార్య గృహిణి కాగా. కుమార్తెలు కూడా ఉద్యోగులు కాదు. అయినా ఈ స్థాయిలో ఆదాయం ఎలా సంపాదించారనే దానిపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. ఇటీవల ప్రముఖ ఆస్పత్రి డైరెక్టర్ కుమారుడితో చిన్న కుమార్తె వివాహాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. ఆ వివాహ వీడియోను కూడా ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

# రారెత్తిస్తున్న ఎండలు..




(సువార్త ప్రతినిధి):ఎండలు రారెత్తిస్తున్నాయి.. దంచి కొడుతున్న ఎండలకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో జనాలు మాడిపోతున్నారు. వడదెబ్బలతో మృత్యువాత పడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా తీవ్ర ఎండలతో జిల్లా అగ్నిగుండంగా కనిపిస్తోంది. ఉదయం 7 గంటల నుంచి ఉక్కపోత సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. పొద్దున 10 గంటలకే జనాలు బయట కాలు పెట్టలేకపోతున్నారు. అత్యవసరం అయితే తప్ప రోడ్లపైకి జనాలు రావడం లేదు. వడగాల్పులకు తలుపులు మూసుకొని ఇండ్లలోనే కూలర్లు. ఫ్యాన్లు. ఏసీల ముందు ఉసూరుమంటున్నారు. ఇళ్లలో ఉన్నా భరించలేనంత వేడి ఉక్కపోతలతో అల్లాడిపోతున్నారు. జిల్లా కేంద్రంలో ఎప్పుడూ రద్దీగా ఉండే మార్కెట్, పెద్ద బజార్, చేనేత చౌక్, వెంకంపేట, గోపాల్ నగర్, గాంధీచౌక్, అంబేద్కర్ చౌరస్తా ప్రాంతాలు వెలవెలబోతున్నాయి. వివిధ ప్రాంతాలకు బస్సుల ద్వారా వెళ్లేవారు ఉదయం, సాయంత్రం వేళల్లోనే ప్రయాణాలు చేయడానికి సిద్ధపడడంతో మధ్యాహ్నం వేళల్లో బస్‌స్టేషన్లు జనసంచారం లేక నిర్మానుష్యంగానే కనిపిస్తున్నాయి. సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో మధ్యాహ్నం వేళల్లో రోడ్లన్నీ కర్ఫ్యూ విధించినట్లుగానే కనిపిస్తున్నాయి.

వామ్మో.. 46.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గతంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల వరకు దాటితేనే వామ్మో అనేవారు. ఈసారి ఏకంగా గురువారం రికార్డు స్థాయిలో 46.4 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రెడ్ అలర్ట్‌గా కొన్ని ప్రాంతాలు, ఆరెంజ్ అలర్ట్‌గా మిగతా ప్రాంతాలు నిలుస్తున్నాయి. వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచనలు చేస్తున్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో రెడ్ జోన్‌లో వేములవాడరూరల్, ముస్తాబాద్, రుద్రంగి, కోనరావుపేట, వేములవాడ, ఇల్లంతకుంట, సిరిసిల్ల మండల్లాలు ఉన్నాయి. అరెంజ్ జోన్‌లో వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, తంగళ్లపల్లి, చందుర్తి, బోయిన్‌పల్లి మండలాలు ఉన్నాయి.

# హీరా గోల్డ్ ఎండీ నౌహీరా షేక్ అరెస్ట్..

## హైదరాబాద్‌కు తరలిస్తున్న ఈడీ

హైదరాబాద్, మే 22(సువార్త ప్రతినిధి): కొంతకాలంగా ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) కళ్లుగప్పి తిరుగుతున్న హీరా గ్రూప్ ఎండీ నౌహీరా షేక్‌ను ఎట్టకేలకు అధికారులు అరెస్ట్ చేశారు. హర్యానాలోని గుర్గావ్‌లో తల దాచుకున్న ఆమెను టెక్నికల్ ఎవిడెన్స్ సహాయంతో ఈడీ అధికారులు గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. కాగా, అరెస్ట్ చేసిన ఆమెను శుక్రవారం గుర్గావ్ నుంచి హైదరాబాద్‌కు తరలించనున్నారు. గతంలోనే సుప్రీంకోర్టు ఆమెను వెంటనే సరెండర్ కావాలని ఆదేశించింది. అంతేకాకుండా, ఆమె బెయిల్‌ను రద్దు చేయాలని ఈడీ కోర్టును ఆశ్రయించింది. ఈ క్రమంలోనే కొద్ది రోజుల క్రితం నౌహీరా షేక్‌పై నాన్–బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. అప్పటి నుంచి ఆమె అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అరెస్ట్ నుంచి తప్పించుకోవడానికి నౌహీరా షేక్ గుర్గావ్‌లో నకిలీ ఆధార్ కార్డ్, తప్పుడు వివరాలతో ఒక ఇంట్లో నివాసం ఉంటున్నట్లు ఈడీ విచారణలో తేలింది.తనపై జారీ అయిన నాన్–బెయిలబుల్ వారెంట్‌పై స్టే ఇవ్వాలని కోరుతూ నౌహీరా షేక్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, అందుకు హైకోర్టు నిరాకరించడంతో ఆమెకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లైంది. హైకోర్టు స్టే ఇచ్చేందుకు నిరాకరించిన కొద్ది రోజుల్లోనే, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఆమె గుర్గావ్‌లో ఉన్నట్లు ఈడీ పక్కాగా గుర్తించి అరెస్ట్ చేసింది.

# ముగిసిన ఇఏపిసెట్

అమరావతి (సువార్త ప్రతినిధి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఇఏపిసెట్–2026 ముగిసింది. ఈ నెల 12 నుంచి ప్రారంభమైన ఈ పరీక్షకు మొత్తంగా 92.60శాతం మంది హాజరయ్యారని ఉన్నత విద్యామండలి కార్యదర్శి బి తిరుపతిరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజనీరింగ్, ఫార్మా పరీక్షకు ఎంపిసి విద్యార్థులు 2,76,576 మంది దరఖాస్తు చేసుకోగా, 2,58,545 (93.48శాతం) మంది హాజరయ్యారు. అగ్రికల్చర్, ఫార్మా పరీక్షకు బైపిసి విద్యార్థులు 79,227 మంది దరఖాస్తు చేసుకుంటే వీరిలో 70,929 మంది(89.53శాతం) హాజరయ్యారు. మొత్తం 3,55,803 మంది దరఖాస్తు చేసుకోగా, 3,29,474 (92.60శాతం) మంది హాజరయ్యారు.

# మూత్రాశయంలో కోడిగుడ్డు లాంటి రాళ్లు



అక్కిరెడ్డిపాలెం(సువార్త ప్రతినిధి):ఓ వ్యక్తి మూత్రాశయంలో కోడిగుడ్డు పరిమాణంలో ఉన్న ఐదు రాళ్లను విశాఖలోని 'కిమ్స్' వైద్యులు శస్త్రచికిత్స చేసి తొలగించారు. లాప్రోస్కోపిక్ యూరో అంకాలజిస్ట్, అండ్రాలజిస్ట్ సందీప్ మహేశ్వరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురానికి చెందిన డి.రామకృష్ణ (51) పొత్తికడుపు నొప్పి, మూత్రవిసర్జనలో తీవ్ర ఇబ్బంది పడుతున్నాడు. ఈనెల 4న షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి వచ్చాడు. డాక్టర్ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు పరీక్షలు చేసి మూత్రాశయంలో కోడిగుడ్డు పరిమాణంలో ఉన్న ఐదురాళ్లను గుర్తించారు. శస్త్రచికిత్స చేశాక రామకృష్ణ పూర్తిగా కోలుకున్నాడని తెలిపారు. మూత్రం నిల్వ ఉండిపోవడం, అడ్డంకులు, ఇన్‌ఫెక్షన్‌ల కారణంగా మూత్రాశయంలో రాళ్లు ఏర్పడతాయని డా.మహేశ్వరరెడ్డి తెలిపారు.

# మహిళల భద్రతకు ప్రాధాన్యం : డీఎస్పీ



వజ్రకరూరు(ఉరవకొండ),(సువార్త ప్రతినిధి): మహిళలు, బాలికల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని డీఎస్పీ శ్రీనివాస్ పేర్కొన్నారు. వజ్రకరూరు మండల కేంద్రం లోని జిల్లా పరిషత ఉన్నత పాఠశాలలో బుధవారం మహిళలు, బాలికల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా పోలీసులను ఆశ్రయించాలన్నారు. మహిళ ల రక్షణ కోసం ప్రభుత్వం స్త్రీ రక్షా పోర్టల్‌ను ప్రవేశ పెట్టిందన్నారు. సీఐలు మహానంది, వెంకటేష్, ఎస్ఐ నాగస్వామి పాల్గొన్నారు.

# ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



మిడుతూరు, (సువార్త ప్రతినిధి): జాతీయ ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలు పరిష్కరించి, ఫొటో యాప్‌ను రద్దు చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఖాజిపేట గ్రామ పొలిమేరలో జరుగుతున్న ఉపాధి పనుల దగ్గరకు వెళ్లి శ్రామికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వికసిత్ భారత్ జీ రాంజీ పథకం రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని అన్నారు. ఉపాధి పనుల్లో ఉపాధి కూలీలకు పనిముట్లు అందించాలని, సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 వేతనం అందించాలన్నారు. పని చోట ప్రమాదంలో మరణించిన శ్రామికులకు రూ.30 లక్షలు, గాయపడితే రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. గోవిందమ్మ, స్వాములు, వడ్డె వెంకటేశ్వర్లు, చిన్నమ్మ, రాణెమ్మ, లక్ష్మీదేవి, సీతరాముడు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# నిప్పుల కొలిమి..



విశాఖపట్నం, (సువార్త ప్రతినిధి): దేశంలో అనేక రాష్ట్రాలు ఎండలు, వడగాడ్పులతో ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. భానుడి భగభగలతో రాష్ట్రం కూడా నిప్పుల కొలిమిలా మారింది. ఈ నెల 24వ తేదీ వరకు అనేక రాష్ట్రాల్లో (ఏపీలో కోస్తాలోని అనేక ప్రాంతాలు, రాయలసీమలో పలు ప్రాంతాలు) వడగాడ్పులు కొనసాగుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటి నమోదవుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. బుధవారం రాష్ట్రంలో ఎండ ఠారెత్తించింది. ఈ వేసవి సీజన్‌లోనే అత్యధికంగా పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. కృష్ణా జిల్లా కంకిపాడు, మార్కాపురంజిల్లా నందనమారెళ్లలో 46.1, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 46, బాపట్ల జిల్లా కొల్లూరు, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడులో 45.9, ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో 45.7, ప్రకాశం జిల్లా కొండపిలో 45.6, తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో 45.5, నెల్లూరు జిల్లా గూడూరులో 45.4, పోలవరం జిల్లా కూనవరంలో 45, గుంటూరు జిల్లా పాండ్రపాడులో 44.8, కోనసీమ జిల్లా రామచంద్రాపురంలో 44.5, అనకాపల్లి జిల్లా మాకవరపాలెలం, తిరుపతి జిల్లా పూలతోటలో 44.4, విశాఖ జిల్లా ములగాడలో 43.6, కాకినాడ జిల్లా కాజులూరులో 43.5, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 43.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కోస్తా, రాయలసీమల్లోని 11 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటాయి. 18 జిల్లాల పరిధిలోని 204 మండలాల్లో 43 డిగ్రీల పైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. తీర ప్రాంతాల్లో అనేక చోట్ల 40 డిగ్రీల మార్కు దాటింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4–7 డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. పల్నాడు జిల్లాలో 23 మండలాలు, కృష్ణాలో 21, ప్రకాశం, ఏలూరు జిల్లాల్లో 20 చొప్పున, బాపట్లలో 17, నెల్లూరులో 16, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో 15 చొప్పున, మార్కాపురం జిల్లాలో 12 మండలాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా కనిపించింది. రానున్న నాలుగు రోజులు కూడా ఇదే వాతావరణం కొనసాగే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

అక్కడక్కడా ఈదురుగాలులతో వర్షాలు

అరేబియా సముద్రం నుంచి కేరళ, కర్ణాటక, కోస్తాంధ్ర మీదుగా బంగాళాఖాతం వరకు విస్తరించిన ఉపరితలద్రోణి ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో బుధవారం అక్కడక్కడా ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. గురువారం కూడా రాష్ట్రంలోని 74 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 232 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. రాయలసీమలో పలుచోట్ల, కోస్తాలో అక్కడక్కడా గంటకు 50 నుంచి 60, అప్పుడప్పుడూ 70 కి.మీ. వేగంతో బలమైన గాలులతో వర్షాలు కురుస్తాయని తెలిపింది.

ఎండ దెబ్బకు భీతిల్లుతున్న ప్రజలు

రాష్ట్రవ్యాప్తంగా ఎండలు ఠారెత్తించడంతో ప్రజలు భీతిల్లారు. భానుడి ప్రతాపానికి వడగాడ్పులు తోడవడంతో విలవిల్లాడారు. ఉదయం 7 గంటల నుంచే ఎండ తీవ్రత మొదలవడంతో ఇళ్లకే పరిమితమయ్యారు. ఉమ్మడి పశ్చిమగోదావరి, పల్నాడు, నెల్లూరు, కృష్ణా జిల్లాల్లో చాలాచోట్ల బిజీ రోడ్లు, మార్కెట్లు, రద్దీ ప్రాంతాలు 10 గంటలకే నిర్మానుష్యంగా మారాయి. చాలామంది పగటి పూట ప్రయాణాలు రద్దు చేసుకోవడంతో బస్సులు, ప్రైవేటు వాహనాలు ఖాళీగా కనిపించాయి. వ్యాపారులు కూడా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు షాపులు మూసి ఉంచుతున్నారు.

# ఐటీలోనూ లూటీ!



(సువార్త ప్రతినిధి) :గతంలో కేంద్ర సర్వీస్‌లో ఉన్న ఢిల్లీ డీల్స్ అధికారి ఐటీ శాఖలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆ సమయంలో అక్కడ కొన్ని ఐటీ కంపెనీలతో సత్సంబంధాలు ఏర్పడ్డాయి. ఏపీలోనూ కొంత కాలం ఐటీ శాఖలో విధులు నిర్వహించారు. ఏ శాఖకు వెళ్లినా అస్మదీయ ఐటీ కంపెనీలను తీసుకువచ్చి కీలకమైన ఐటీ బాధ్యతలు అప్పగించడం, తద్వారా కొంత వెనకేసుకోవడం ఆయనకు మామూలైంది. ఆరోగ్య శాఖకు వచ్చినప్పటి నుంచీ ఇదే పనిలో ఉన్నారు. అస్మదీయ కంపెనీలకు టెండర్లు దక్కేలా అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు.

ఒత్తిడిలో సామాన్యుడి జీవనం

ఆరోగ్య శాఖలో అవినీతి అంతా ఇంతా కాదు. మందుల కొనుగోళ్లు.. వైద్య పరికరాల కొనుగోళ్లు.. బిల్లుల చెల్లింపులు.. చివరికి టెండర్ ప్రక్రియలోనూ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా 'ఢిల్లీ డీల్స్' అధికారి అవినీతి దాహానికి అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఆరోగ్య శాఖ పిలిచే ప్రతి టెండర్‌లోనూ 'నాకేంటి' అన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సంజీవని, సిటిజన్ హెల్త్ స్క్రీనింగ్, పాపులేషన్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులలోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కొన్ని టెండర్లలో ముందుగానే కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుని వాటికి అనుగుణంగా టెండర్ నిబంధనలు రూపొందించడం, వాటికే టెండర్ వచ్చేలా ఒత్తిడి చేయడం సదరు అధికారికి అలవాటుగా మారింది. ఈ మధ్యకాలంలో ఆరోగ్య శాఖలో ఐటీ సేవలపై ఢిల్లీ డీల్స్ అధికారి కన్ను పడింది. ఐటీ పేరుతో కోట్లు లూటీ చేసేద్దామని స్కెచ్ వేశారు. ముఖ్యంగా ఎన్‌హెచ్‌ఎం (నేషనల్ హెల్త్ మిషన్)లో ఐటీ సేవలు చాలా కీలకం. ఆశా వర్కర్ దగ్గరి నుంచి పీహెచ్‌సీ వైద్యుల వరకూ ప్రతి ఒక్కరికి ఒక యాప్ ఉంటుంది. ఆ యాప్ ద్వారానే వారు కీలకమైన నివేదికలు ఎన్‌హెచ్‌ఎంకు పంపిస్తుంటారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ఏ సర్వే చేపట్టినా యాప్‌ల ద్వారా నివేదికలు తెప్పించుకుంటుంది. ఎన్‌హెచ్‌ఎంలో దాదాపు 40 యాప్‌ల వరకూ ఉపయోగిస్తున్నారు. ఈ యాప్‌లను నిర్వహించేందుకు ఒక ఐటీ కంపెనీని టెండర్ ప్రక్రియ ద్వారా ఐదేళ్ల క్రితం ఎంపిక చేశారు. ఈ ఏడాది జనవరిలో ఆ టెండర్ గడువు పూర్తయింది. ఇప్పుడు మళ్లీ టెండర్లు ఆహ్వానించి కొత్త ఐటీ కంపెనీని ఎంపిక చేసి, యాప్‌ల నిర్వహణ బాధ్యతను అప్పగించాలి. ఢిల్లీ డీల్స్ అధికారి కన్ను దీనిపై పడింది.ఐటీ కార్యకలాపాలు, డేటా కలెక్షన్‌పై దృష్టిపెట్టారు. వారానికి రెండు సార్లు వీడియో కాన్ఫరెన్స్‌లు, రోజు కోసారి టెలీకాన్ఫరెన్స్‌లు నిర్వహించడం, రోజువారీ డేటా ఇవ్వడంటూ ఆశా వర్కర్ దగ్గర నుంచి వైద్యులు, డీఎంహెచ్‌వోలు చివరికి హెచ్‌వోడీల వరకూ ఒత్తిడి చేస్తున్నారు. అడిగిన డేటా ఇవ్వకపోతే వారికి తిట్లదండకం తప్పదు. గత ఏడు నెలల నుంచి ఆరోగ్య శాఖలో ఇదే తంతు. ఇదంతా అస్మదీయ ఐటీ కంపెనీలను ఆరోగ్య శాఖలోకి తీసుకురావడానికే అన్న విషయం ఇప్పుడు బహిర్గతమైంది. ఎన్‌హెచ్‌ఎం ఐటీ టెండర్ల విలువ రెండింతలు చేశారు. ప్రస్తుతం ఎన్‌హెచ్‌ఎం ఐటీ సేవలకు నెలకు రూ.23 లక్షలు చెల్లిస్తోంది. అంటే.. ఏడాదికి రూ.2.76 కోట్లు. ఆ మొత్తాన్ని ఢిల్లీ డీల్స్ అధికారి ఏకంగా రూ.5 కోట్లకు పెంచారు. ఈ టెండర్‌ను అస్మదీయ కంపెనీకి అప్పగించాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

# యూరియా, డిఏపి తక్కువ అమ్మండి

– అమరావతి(సువార్త ప్రతినిధి): ఖరీఫ్‌లో రైతులతో యూరియా, డిఏపి ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ (స్పెషల్ డ్రైవ్) ప్రారంభించింది. గతేడాది అమ్మకాల కంటే తక్కువ మొత్తంలో రైతులకు ఎరువులను విక్రయించాలని హోల్‌సేల్, రిటైల్ డీలర్లకు ఆంక్షలు విధిస్తోంది. తమ వద్ద నిల్వలు ఉన్నప్పటికీ నిరుడు అమ్మినదానికంటే ఎంతమాత్రం ఎక్కువ అమ్మవద్దని హెచ్చరిస్తోంది. ఒకవేళ రైతులు అడిగినా సముదాయించి తర్వాత రావాలనిచెప్పి తిప్పి పంపాలని సూచిస్తోంది. తమ వద్ద స్టాక్ లేదని చెప్పాలని సలహా ఇస్తోంది. తమ ఆదేశాలను అతిక్రమిస్తే లైసెన్స్‌ల సస్పెన్షన్, లైసెన్స్‌ల రద్దు, బ్లాక్ లిస్టు, కేసుల నమోదు వంటి కఠిన చర్యలు చేపడతామని హెచ్చరిస్తోంది. దుకాణదారులు తాము విక్రయించిన రైతులకు సంబంధించిన ఆధార్, ఫోన్‌నెంబర్, పట్టాదార్ ప్యాస్ పుస్తకం, ఇతర భూమి అధీకృత సమాచారం, డిబిటి డేటా, ఏ పంట వేయడానికి కొనుగోలు చేసిందిడ తదితర సమగ్ర వివరాలను తమకు అందజేయాల్సి ఉంటుందని పేర్కొంటోంది. రైతులకు ఇస్తున్న ఎరువుల సబ్సిడీని ఎలాగైనాసరే తగ్గించుకోవాలని కేంద్ర ప్రభుత్వం అన్ని దారులూ తొక్కుతోంది. అమ్మకాలు, వినియోగంపై నిఘా పెట్టాలని ఇప్పటికే రాష్ట్రాలను ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఎరువుల వాడకం తగ్గాల్సి ఉండగా 2025–26లో పెరిగిందని చెప్పి, 2026–27లో తగ్గించాలని నిర్దేశించింది. కేంద్రం ఆదేశాలతో రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం నిఘాను ముమ్మరం చేయడంతో పాటు అవగాహన పేరిట జిల్లాల్లో వ్యవసాయాధికారులతో డీలర్లను సమావేశపర్చి ఎరువుల అమ్మకాల తగ్గింపునకు స్పెషల్ డ్రైవ్ నడుపుతోంది. ఇప్పటికే రాష్ట్ర సరిహద్దు జిల్లాల్లో నాలుగైదు ప్రభుత్వ శాఖల అధికారులతో ఏప్రిల్‌లో ఎరువుల అమ్మకాలపై విచారణలు జరిపి పలు దుకాణదారులపై కేసుల నమోదు, లైసెన్స్‌ల రద్దు, ఫ్రీజ్ వంటి చర్యలకు పాల్పడింది. ఇంకోవైపు ఎపి అగ్రికల్చర్ ఇంటిగ్రేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం యాప్ ద్వారా రైతులకు ఎరువులను విక్రయించాలని నిర్ణయించింది. రైతులకు ప్రత్యేకంగా గుర్తింపు కార్డులిస్తామని ప్రకటించింది. ప్రభుత్వ ఈ చర్యలన్నీ వెూడీ ప్రభుత్వం వద్ద లొంగుబాటును తెలుపుతున్నాయని రైతుసంఘాలు, కొన్ని ప్రతిపక్ష పార్టీలు, విశ్లేషకులు పేర్కొంటున్నారు. రైతులకు అవసరమైన ఎరువులను అదనుకు అందుబాటులో ఉంచేందుకు అవసరమైతే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాల్సిన టిడిపి ప్రభుత్వం, రైతుల ప్రయోజనాలకు కాకుండా రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తోం దంటున్నారు.

# మణిపూర్‌లోని కాంగ్‌పోక్పి జిల్లాలో అంత్యక్రియల వద్ద, తన తండ్రి హంతకులను క్షమించిన రెవరెండ్ డాక్టర్ వి. సిట్లో కుమారుడు....




(సువార్త ప్రతినిధి): మణిపూర్‌లోని కాంగ్‌పోక్పి జిల్లాలో జరిగిన ఒక దాడిలో హత్యకు గురైన ముగ్గురు థాడౌ చర్చి నాయకుల అంత్యక్రియలు మే 15న మోట్‌బంగ్‌లోని థాడౌ బాప్టిస్ట్ అసోసియేషన్ ఇండియా చర్చి ప్రాంగణంలో జరిగాయి. ఈ తుది సంస్కారాలకు కొండ జిల్లాల నలుమూలల నుండి సంతాపకులు తరలివచ్చారు. అంత్యక్రియలు జరిపిన ముగ్గురిలో థాడౌ బాప్టిస్ట్ అసోసియేషన్ ఇండియా అధ్యక్షుడు డా. రెవరెండ్ వుమ్‌థాంగ్ సిట్ల్‌హౌ; రెవరెండ్ కైగౌలున్; మరియు పాస్టర్ పాగౌలెన్ ఉన్నారు. మరణించే సమయానికి, డా. రెవరెండ్ వుమ్‌థాంగ్, మణిపూర్‌కు ఆవల ఉన్న థాడౌ చర్చిలను అనుసంధానించే లక్ష్యంతో, ఈ సంవత్సరం చివరలో ప్రారంభం కానున్న గ్లోబల్ థాడౌ క్రిస్టియన్ కాంగ్రెస్‌ను స్థాపించేందుకు కృషి చేస్తున్నారు. చురాచంద్‌పూర్‌లో జరిగిన యునైటెడ్ బాప్టిస్ట్ కన్వెన్షన్ సమావేశానికి హాజరైన తర్వాత కాంగ్‌పోక్పికి తిరిగి వస్తుండగా, మే 13న ఈ ముగ్గురిపై కాల్పులు జరిగాయి. కోట్లెన్–కోట్జిమ్ రహదారిపై ఉన్న జీరో పాయింట్ వద్ద వారి వాహనాలపై ఈ దాడి జరిగింది. వారితో పాటు ప్రయాణిస్తున్న మరో ఐదుగురు పాస్టర్లు, చర్చి కార్యకర్తలు తుపాకీ గాయాలతో షిజా హాస్పిటల్స్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో చికిత్స పొందుతున్నారు. హత్యకు గురైన రెవరెండ్ డాక్టర్ వి. సిట్లో కుమారుడు హామిన్‌లున్ సిట్లో, అంత్యక్రియల వద్ద మాట్లాడటానికి లేచారు. క్రిస్టియన్ టుడే ఇండియాకు లభించి, లిఖితరూపంలోకి మార్చబడిన ఒక వీడియోలో, ఆయన కేవలం తన సొంత సమాజాన్ని మాత్రమే కాకుండా రాష్ట్రంలోని ప్రతి సమాజాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. "మా నాన్నను ప్రేమించే వారందరికీ, మా నాన్నను గౌరవించాలనుకునే వారందరికీ, మణిపూర్‌లోని ఈ చిన్న రాష్ట్రంలో నివసిస్తున్న మైతేయిలు, కుకీలు, నాగాలు వంటి అన్ని వర్గాల వారికి నేను ఈ విషయాన్ని స్పష్టం చేయాలనుకుంటున్నాను," అని ఆయన అన్నారు. "2026 మే 13న చిందిన రక్తం, మన రాష్ట్రంలో శాంతి, మోక్షం, న్యాయం, సామరస్యం మరియు ప్రశాంతతను తీసుకువచ్చే త్యాగపు రక్తంగా నిలవాలి. మన ప్రతీకార చర్యలను ఆపుదాం."

# దక్షిణ కొరియాలో విల్ గ్రాహం క్రూసేడ్‌లో విశ్వాస నిర్ణయాలు తీసుకున్నా వందలాది మంది ప్రజలు..




(సువార్త ప్రతినిధి): గత వారాంతంలో సియోల్‌కు ఉత్తరాన ఉన్న ఒక నగరంలో, విల్ గ్రాహం నేతృత్వంలో జరిగిన సువార్త ప్రచార యాత్ర కోసం 21,000 మందికి పైగా ప్రజలు గుమిగూడారు. దక్షిణ కొరియా అంతటా నూతన పునరుజ్జీవనానికి పిలుపుగా అభివర్ణించబడిన ఈ కార్యక్రమంలో వేలాది మంది విశ్వాస ప్రతిజ్ఞలు చేశారని నిర్వాహకులు నివేదించారు. ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల సెల్సియస్‌ను మించి ఉన్నప్పటికీ, ఉత్తర గ్యోంగీ ప్రావిన్స్ నలుమూలల నుండి పాల్గొనేవారిని ఆకర్షిస్తూ, మే 17న ఉయిజియోంగ్‌బు బిలీ గ్రాహం క్రూసేడ్ ఉయిజియోంగ్‌బు స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో 695 మందికి పైగా ప్రజలు యేసు క్రీస్తును అనుసరించడానికి ప్రతిజ్ఞలు చేశారని బిలీ గ్రాహం ఎవాంజెలిస్టిక్ అసోసియేషన్ నివేదించింది. కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు మరియు దివంగత సువార్తికుడు బిలీ గ్రాహం మనవడైన విల్ గ్రాహం, లూకా 15లోని తప్పిపోయిన కుమారుని ఉపమానాన్ని ఉదహరిస్తూ ప్రధాన సందేశాన్ని అందించారు. "ఆ యువకుడు ఇంటికి వెళ్ళాడు. అతని తండ్రి అతని కోసం ఎదురుచూస్తూ, అతని కోసం కనిపెట్టుకొని ఉన్నాడు," అని ప్రకారం గ్రాహం అన్నారు. "దేవుడు మీ గురించి కూడా అలాగే భావిస్తాడు. ఈ రాత్రి మీరు మీ పరలోకపు తండ్రి వద్దకు తిరిగి వస్తారా?" క్రిస్టియన్ డైలీ కొరియా నివేదించిన ప్రకారం, గ్రహం ఒక ను విస్మరించి తప్పుడు మార్గంలో ప్రయాణం కొనసాగించడం గురించి ఒక వ్యక్తిగత ఉదాహరణను కూడా ఉపయోగించి, జనసమూహంతో ఇలా అన్నారు: "మనం తరచుగా నావిగేషన్ తప్పు అని భావించి, మనమే ఎంచుకున్న తప్పుడు మార్గంలోనే వెళ్లాలని పట్టుబడతాము." క్రీస్తు వైపు తిరగడమే "జీవితంలో ఉన్న ఏకైక సరైన మార్గం" అని ఆయన అభివర్ణించారు. సందేశం అనంతరం, సుమారు 30 నిమిషాల పాటు సాగిన సుదీర్ఘ ఆహ్వానం సందర్భంగా వందలాది మంది వేదిక ముందు భాగానికి నడిచారు. హిల్‌సాంగ్ యునైటెడ్ గాయని, ఆస్ట్రేలియన్ ఆరాధన కళాకారిణి అయిన టాయా ప్రారంభ ఆరాధనకు నాయకత్వం వహించారు. "మనం ఘనపరచి, ప్రకటించవలసిన ఏకైక నామం యేసు ఒక్కరే," అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణలో 260కి పైగా చర్చిలు పాల్గొన్నాయని బీజీఈఏ తెలిపింది. ఈ ప్రాంతంలోని 10 నగరాలు మరియు కౌంటీలలోని 71 తెగలకు చెందిన సుమారు 5,000 చర్చిలు పాల్గొన్న ఈ క్రూసేడ్, తెగల హద్దులను దాటిన ఒక ఐక్య ప్రయత్నమని కొరియన్ నిర్వాహకులు అభివర్ణించారు.

# విధ్వంస ఘటనల నేపథ్యంలో రోడ్డు పక్కన ఉన్న క్రైస్తవ శిలువల చుట్టూ భద్రతను పెంచిన ముంబై పోలీసులు




(సువార్త ప్రతినిధి): ఒక పారిష్ ప్రాంతంలోని చారిత్రాత్మక శిలువ వరుసగా రెండు రోజుల పాటు ధ్వంసం కావడంతో, ముంబై పోలీసులు రోడ్డు పక్కన ఉన్న క్రైస్తవ శిలువల చుట్టూ భద్రతను పెంచారు. గుర్తుతెలియని వ్యక్తులు రెండు వేర్వేరు ఘటనలలో శిలువను ధ్వంసం చేసిన నేపథ్యంలో, సెయింట్ జాన్ ది ఎవాంజెలిస్ట్ పారిష్ ప్రాంతంపై మరింత కట్టుదిట్టమైన నిఘా ఉంచినట్లు అధికారులు ధృవీకరించారు. ఈ కేసులు దర్యాప్తులో ఉన్నాయని సీనియర్ పోలీస్ అధికారి రవీంద్ర వాణి తెలిపారు. మే 18న, పోలీసులు పారిష్ పూజారి ఫాదర్ ఆంథోనీ ఫెర్నాండెస్‌కు లేఖ రాసి, ఆ ప్రాంతంలోని అన్ని శిలువల వివరాలను కోరారు, తద్వారా వాటిని మరింత విధ్వంసం నుండి సరిగ్గా రక్షించవచ్చు. అంధేరి ఈస్ట్ ప్రాంతంలోని అధికారులు ఇప్పుడు ఆ ప్రదేశాలను మరింత నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. ఫాదర్ ఫెర్నాండెజ్ మాట్లాడుతూ, తమ పారిష్ సుమారు 15 రోడ్డు పక్క శిలువలను గుర్తించిందని, వాటిలో చాలా వరకు శతాబ్దాల నాటివని భావిస్తున్నట్లు చెప్పారు. మే 13, 14 తేదీలలో అదే శిలువ ధ్వంసం అయిన తర్వాత, ఆయన మే 14న ఈ తాజా సంఘటన గురించి పోలీసులకు నివేదించారు. ముంబై అంతటా రోడ్డు పక్క శిలువలు సర్వసాధారణం. ఇవి 16వ మరియు 18వ శతాబ్దాల మధ్య పోర్చుగీస్ వలస పాలన కాలం నాటి మూలాలున్న కాథలిక్ సమాజాలతో దగ్గరి సంబంధం కలిగి ఉన్నాయి. ఈ శిలువల్లో చాలా వరకు ప్రార్థనా స్థలాలుగా ఉండటమే కాకుండా, స్థానిక క్రైస్తవ వారసత్వానికి చారిత్రక చిహ్నాలుగా కూడా పనిచేస్తాయి. పారిష్ ప్రకారం, దెబ్బతిన్న శిలువను భక్తులు రోజూ ఉపయోగిస్తుంటారు. వారి రోజువారీ ప్రయాణాలలో 10,000 మందికి పైగా భక్తులు దాని పక్కగా వెళుతూ, ప్రార్థన చేయడానికి లేదా కొవ్వొత్తులు వెలిగించడానికి ఆగుతుంటారు.

# 'బలమైన మతం అంటే తక్కువ నేరాలు': అమెరికా విశ్వాస కార్యక్రమం తర్వాత క్రైస్తవ సంస్థలను ప్రశంసించిన ట్రంప్..



(సువార్త ప్రతినిధి): అమెరికా మత వారసత్వ వేడుకను డొనాల్డ్ ట్రంప్ ప్రశంసించారు. దేశ క్రైస్తవ విలువలను గౌరవించడం వల్ల నేరాలు తగ్గుతాయని ఆయన పేర్కొన్నారు. మంగళవారం తన కొత్త వైట్ హౌస్ బాల్‌రూమ్ స్థలంలో జరిగిన ఒక పత్రికా సమావేశంలో, ప్రార్థన, ఆరాధన మరియు సంప్రదాయవాద రాజకీయ నాయకుల సందేశాలతో కూడిన 'రీడెడికేట్ 250' కార్యక్రమంపై అమెరికా అధ్యక్షుడు స్పందించారు. ఈ కార్యక్రమం అమెరికా 250వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, దాని యూదు–క్రైస్తవ వారసత్వాన్ని గౌరవించిందని మద్దతుదారులు అన్నారు. అయితే, ఇది దేశంలోని విస్తృత మత వైవిధ్యాన్ని విస్మరించి, మతానికి, ప్రభుత్వానికి మధ్య ఉన్న హద్దులను చెరిపివేసిందని విమర్శకులు పేర్కొన్నారు. అధ్యక్షుడు ట్రంప్ ఇలా అన్నారు: "వేలాది మంది ప్రజలు హాజరయ్యారు, అది చాలా అందంగా ఉంది. ఒక దేశానికి మతం చాలా ముఖ్యమని నేను భావిస్తున్నాను. "మతం బలంగా ఉన్నప్పుడు, నేరాలు తక్కువగా ఉంటాయి. ఇది ఒక వాస్తవం. ఇది 'అయ్యో, నేను స్వర్గానికి వెళ్లాలనుకుంటున్నాను, కాబట్టి నేను ఇది లేదా అది చేయను' అన్నట్లు ఉంటుంది. "నేను ఎప్పుడూ ఆందోళన చెందుతూ ఉంటాను. జరుగుతున్న విషయాలను నేను గమనిస్తూ ఉంటాను. మానవజాతి ఆరంభం నుండి, మంచి మరియు చెడు రెండూ ఉన్నాయి. నేను చెడును వదిలించుకోవాలనుకుంటున్నాను, కానీ అది ఏదో ఒక విధంగా అలాగే ఉండిపోతుంది," అని ఆయన అన్నారు. కాథలిక్ చర్చి నాయకుడు వలస విధానాన్ని మరియు ఇరాన్ యుద్ధాన్ని ఖండించినందుకు ప్రతిస్పందనగా, పోప్ లియో "నేరాల విషయంలో బలహీనంగా ఉన్నారని" ఆరోపించిన తర్వాత, అధ్యక్షుడు ట్రంప్ రాజకీయాలను, మతాన్ని ముడిపెట్టడం ఇది మొదటిసారి కాదు. అమెరికా సాధించిన అనేక "విజయాలకు" క్రైస్తవ మతమే కారణమని, తన పదవీకాలంలో చర్చికి హాజరయ్యే వారి సంఖ్య పెరగడంతో "మతం అద్భుతంగా పునరాగమనం చేస్తోందని" అధ్యక్షుడు విలేకరులతో అన్నారు.

# మే 24, పెంతెకోస్తు ఆదివారం నాడు అంతర్జాతీయ సువార్త అందని ప్రజల దినోత్సవం ...



(సువార్త ప్రతినిధి): మే 24, పెంతెకోస్తు ఆదివారం నాడు అంతర్జాతీయ సువార్త అందని ప్రజల దినోత్సవం తిరిగి వస్తున్న సందర్భంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న విశ్వాసులను, సువార్తను అందుకోలేని సుమారు 320 కోట్ల మంది ప్రజల కోసం ప్రార్థించమని, పంచుకోమని మరియు సమీకరించమని క్రైస్తవ సంస్థలు పిలుపునిస్తున్నాయి. ఇప్పుడు 10వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన ఈ ఆచరణ, అంచనా ప్రకారం 7,000 సువార్త అందని ప్రజల సమూహాలపై కేంద్రీకృతమై ఉంది --- అంటే, బయటి సహాయం లేకుండా విస్తృత జనాభాకు సువార్తను ప్రకటించడానికి అవసరమైన వనరులతో ఏ స్వదేశీ చర్చి కూడా లేని సమాజాలు. మిస్సియో నెక్సస్ మరియు థర్డ్ ఆఫ్ అస్ అలయన్స్‌లోని భాగస్వాములు ఈ దినోత్సవానికి ముందు అనేక రకాల వనరులను విడుదల చేశారు. ఈ కొత్త సాధనాలలో ఒకటి, థర్డ్ ఆఫ్ అస్ అలయన్స్ అభ్యర్థన మేరకు జాషువా ప్రాజెక్ట్ అభివృద్ధి చేసిన 'లైట్ ది నేషన్స్' అనే డిజిటల్ ప్రార్థన పటం. prayermap. joshuaproject. అవ్‌లో అందుబాటులో ఉన్న ఈ పటం, వినియోగదారులు ఒక సువార్త అందని ప్రజల సమూహాన్ని ఎంచుకుని వారి కోసం ప్రార్థించడానికి అనుమతిస్తుంది; ప్రతి ప్రార్థన పటంలో ఆ సమూహం ఉన్న ప్రదేశాన్ని వెలిగిస్తుంది. ఏడు రోజుల ప్రార్థన మార్గదర్శి, ప్రపంచంలోని ప్రధాన మత సమూహాల గుండా పాల్గొనేవారిని నడిపిస్తుంది మరియు దీనిని సంవత్సరంలో ఏ సమయంలోనైనా ఉపయోగించవచ్చు. మే 24వ తేదీన, అతి తక్కువగా చేరుకోబడిన జనాభాపై దృష్టి సారించి "ప్రార్థన కచేరీలు" నిర్వహించమని నిర్వాహకులు సంఘాలను ప్రోత్సహిస్తున్నారు. ఆ సాయంత్రం మిస్సియో నెక్సస్ జూమ్ ద్వారా తన సొంత ఆన్‌లైన్ ప్రార్థన కచేరీని నిర్వహిస్తుంది. దీనికి సంబంధించిన సహాయక సామగ్రిలో పవర్‌పాయింట్ గైడ్ మరియు ఎంపిక చేసిన ప్రేయర్‌కాస్ట్ వీడియోలు ఉంటాయి.

# యునైటెడ్ బైబిల్ సొసైటీస్ 80వ వార్షికోత్సవం




(సువార్త ప్రతినిధి): యునైటెడ్ బైబిల్ సొసైటీస్ , ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువ తరాలకు పవిత్ర గ్రంథాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి తమ నిబద్ధతను పునరుద్ధరించుకుంటూ, ఈ నెలలో ఒక చారిత్రాత్మక ప్రకటనను విడుదల చేసింది. ఈ ప్రకటన ద్వారా తమ ఎనిమిది దశాబ్దాల ప్రపంచవ్యాప్త పరిచర్యను ఇది పూర్తి చేసుకుంది. 156 బైబిల్ సొసైటీల ఈ సమాఖ్య, మే 6--11 తేదీలలో జకార్తాలో జరిగిన తమ వార్షికోత్సవ సమావేశంలో "రేపటి కోసం బైబిల్: భవిష్యత్ క్రైస్తవ తరాలకు ప్రపంచ నిబద్ధత" అనే ప్రకటనను జారీ చేసింది. దీనితో పాటు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న బైబిల్ సొసైటీల ప్రతినిధులు పాల్గొన్న ఒక సమాంతర ఆన్‌లైన్ కార్యక్రమం కూడా జరిగింది. ప్రపంచ అస్థిరత మరియు నైతిక అనిశ్చితితో తాము సతమతమవుతున్నామని చాలామంది నివేదిస్తున్నప్పటికీ, యువతలో పెరిగిన ఆధ్యాత్మిక స్వేచ్ఛకు ప్రతిస్పందనగా, ఈ ప్రకటన ఖదీూ తన వ్యవస్థాపక దృష్టి అయిన "ప్రతిఒక్కరి కోసం బైబిల్"ను పునరుద్ఘాటిస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత మే 1946లో ఖదీూ అధికారికంగా స్థాపించబడినప్పటికీ, దాని మూలాలు 19వ శతాబ్దం ప్రారంభంలో మరియు 200 సంవత్సరాలకు పైగా విస్తరించిన ప్రపంచ బైబిల్ ఉద్యమంలో ఉన్నాయి. నేడు ఈ ఫెలోషిప్ 240కి పైగా దేశాలు మరియు భూభాగాలలో పనిచేస్తోంది మరియు ఈ సంస్థ ప్రకారం, ప్రపంచంలోని 70% కంటే ఎక్కువ బైబిల్ అనువాదాలకు ఇది దోహదపడింది --- దీనివల్ల 6.2 బిలియన్ల కంటే ఎక్కువ మంది ప్రజలు తమ మాతృభాషలో పవిత్ర గ్రంథాన్ని చదవగలుగుతున్నారు. సెక్రటరీ జనరల్ డిర్క్ గెవర్స్ మాట్లాడుతూ, ఈ వార్షికోత్సవం కృతజ్ఞతకు మరియు భవిష్యత్ దృష్టితో కూడిన నిబద్ధతకు ఒక సందర్భమని అన్నారు. "19వ శతాబ్దం ప్రారంభంలో మన ప్రపంచ బైబిల్ ఉద్యమం మొదలైనప్పటి నుండి, దేవుని విశ్వసనీయతకు మరియు వివిధ భాషలు, సంస్కృతులు, తరాలకు బైబిల్‌ను అందుబాటులోకి తెచ్చిన లెక్కలేనంత మంది ప్రజలకు వేము కృతజ్ఞతలు తెలుపుతు న్నాము," అని ఆయన అన్నారు. "సంక్లిష్టమైన ఈ ప్రపంచంలో అర్థాన్ని వెతుకుతున్న యువతకు మరియు అందరికీ బైబిల్ ఆశ, సత్యం మరియు మార్గదర్శకత్వాన్ని అందిస్తూనే ఉందని మేము విశ్వసిస్తున్నాము."ఈ ప్రకటనను ఫెలోషిప్‌లోని యువ నాయకులకు, కొలంబియన్ బైబిల్ సొసైటీకి చెందిన ఆల్బర్ట్ బారెరో మరియు బురుండి బైబిల్ సొసైటీకి చెందిన సోనియా ఇరాన్‌కుండతో పాటు, ఇండోనేషియన్ బైబిల్ సొసైటీ యువ ప్రతినిధులకు అందజేశారు --- రాబోయే తరాల పట్ల తమ నిబద్ధతకు ప్రతీకగా ఈ చర్య ఉద్దేశించబడిందని ఆ సంస్థ పేర్కొంది.

# ఆదరణ కరువైనట్లనిపిస్తుందా ?




(సువార్త ప్రతినిధి): సమస్యల సుడిగుండాలలో పడి తిరుగుతూ, శోధన వెంబడి శోధన వెంటాడుతున్నప్పుడు, ఆదరించేవారు లేక, ఓదార్చేవారసలే లేక, నిరాశా నిస్పృహలతో నిండిన నీ జీవితంలో, ఒక్కసారి నీవు వెనక్కి తిరిగి నిశితంగా పరిశీలించ గలిగితే, కృపవెంబడి కృప నిన్ను వెంటాడుతున్నాడనే విషయం స్పష్టముగా అర్థం చేసుకోగలవు. ఆయన దుడ్డుకర్రయు, దండమును నిన్నెప్పుడూ ఆదరిస్తూనే ఉంటాయి. ఆయన దుడ్డుకఱ్ఱయు, దండమును నిన్ను ఆదరించును. కీర్తనలు 23:4

దుడ్డుకర్ర

దుడ్డుకర్ర దండించేది మాత్రమే కాదు'దారి చూపేది,సరిచేసేది, శత్రువు దరిచేరకుండా చేసేది. కాపరి దుడ్డుకర్రను ఏయే సందర్భాలలో ఉపయోగిస్తాడు?

1. శత్రువులు మందను వెంతాడుతున్నప్పుడు వాటినుండి మందను రక్షించడానికి.

2. కొన్ని మొండి గొర్రెలు కాపరి మాట వినకుండా మంద నుండి చెదరిపోతూ వున్నప్పుడు, కాపరి దుడ్డి కర్రతో వాటిని దండిస్తాడు. వాటి కాలు విరగ్గొట్టి, మరల దానికి కట్టుకట్టి, కాపరి భుజాలపై దానిని మోస్తూ , మంచి చిగురిటాకులు వాటికి ఆహారంగా సమకూర్చి, వాటి గాయం తగ్గేవరకు, పరిచర్య చేస్తాడు. కాపరి ప్రేమను రుచి చూచిన ఆ గొర్రె ఎప్పటికి కాపరిని విడచి దూరంగా వెళ్ళడానికి ఇష్టపడదు.

దేవునికి వ్యతిరేకంగా జీవిస్తున్నప్పుడు కొన్నిసార్లు దుడ్డికర్ర దెబ్బలు( శోధనలు, వేదనలు, అవమానములు) తప్పవు. అవి దేనికోసం అంటే దేవునితో ఇంకా సన్నిహిత సంబంధం కలిగియుండడానికి మాత్రమే.

3. కొన్ని సందర్భాలలో చీకటిగుండా కాపరి మందను తీసుకొని వెళ్తున్నప్పుడు, కాపరి ఎటువైపు వెళ్తున్నాడో, గొర్రెలకు కనిపించదు. అట్లాంటప్పుడు, కాపరి దుడ్డుకర్రతో నేలమీద టక్....టక్ ....టక్ అంటూ శబ్దం చేసుకొంటూ ముందుకు వెళ్లిపోతుంటే, ఆ శబ్దాన్ని బట్టి గొర్రెలు కాపరిని అనుసరిస్తూ సాగిపోతాయి. "గొర్రెలు నా స్వరము వినును" (యోహాను 10:27)

"గొర్రెలకు కాపరి కనిపించకపోయినా, శబ్దం వినిపిస్తుంది ముందుకు సాగిపోవడానికి. "

" మనకు యేసయ్య కనిపించకపోయినా, ఆయనిచ్చిన వాగ్దానాలు వినిపిస్తున్నాయి ముందుకు సాగిపోవడానికి." ఆయన వాగ్దానాలే మన జీవితాలకు చెప్పలేనంత ఆదరణ. ఊహించలేనంత ఊరట. సాగిపోదాం! ఆగిపోకుండా! అలసటలేకుండా! అద్దరి చేరువరకు!

దండము

గాయపరచేది కాదు, సరిగా నడిపించేది, ఆహారం సమకూర్చేది

కాపరి దండమును ఏయే సందర్భాలలో ఉపయోగిస్తాడు?

దండము అంటే ఒక పొడవాటి కర్రకు కొంకి కట్టి వుండేది.

1. కాపరి మందను మేపుతున్నప్పుడు ఆ మంద చెట్లు ఆకుల్ని తినడానికి అవి అందక ఇబ్బంది పడుతుంటే, కాపరి ఆ దండము సహాయంతో ఆ కొమ్మలను వాటికి అందేలా క్రిందకి లాగుతాడు. అంటే తన మందకు ఆహారం సమకూర్చడానికి కొన్నిసందర్భాలలో దండమును ఉపయోగిస్తాడు.

2. కొన్నిసందర్భాలలో కొన్ని గొర్రెలు త్రోవ తప్పి బయటకి పోతుంటే కాపరి ఆ పొడవాటి దండమును వాటి నడుముకు వేసి బలంగా మందలోనికి లాగుతాడు. ఆ సరిచేసే క్రమంలో అనేకసార్లు వాటికి గాయాలవుతాయి. అట్లా అని గాయపరచడం కాపరి ఉద్దేశ్యం కాదు. సరిచెయ్యడమే. అట్లా అని చెప్పి గాయపడిని వాటిని అట్లానే వుండనియ్యడు. వాటికి కట్టుకట్టి, పరిచర్య చేస్తాడు.

కొన్ని సందర్భాలలో మనలను దేవుడు సరిచేసే క్రమంలో కొన్ని శోధనలు, ఇరుకులు, ఇబ్బందులు రావడం సహజమే. అట్లా అని దేవుడు విడచిపెట్టినట్లు కాదు. ఆ శోధనలలో తిరిగి ఆదరిస్తాడు. విజయాన్నిస్తాడు. ఆ దండమును దేవుడు మన మీద ప్రయోగిస్తే అది మేలుకేగాని, కీడుకు కాదు. అట్లాంటి ఇబ్బందికర పరిస్తితులను మనము ఎదుర్కొంటున్నప్పుడు, ఒక్కసారి ఆలోచిద్దాం. ఎక్కడ తప్పిపోయామో పరీక్షించుకుందాం.

ఆ చిన్న కుమారుడు పందుల పొట్టు తినే పరిస్తితికి చేరుకున్నప్పుడు అతడు ఆలోచించ గలిగాడు. ఎక్కడ తప్పిపోయాను అని. ఎక్కడ తప్పిపోయాడో అర్థమయ్యింది. మరల తిరిగి అక్కడకే పయనం సాగిస్తున్నాడు. తప్పిపోయిన మనం తిరిగి తండ్రి దగ్గరికి చేరాలి. పయనమవుదాం! ఆగిపోకుండా సాగిపోదాం! అలసటలేకుండా! అద్దరి చేరువరకు! మన కోసం ప్రాణం పెట్టిన ఆ నిజమైన మంచి కాపరి కృప మనకు తోడుగా ఉండును గాక! ఆమెన్!

## ఫేక్ పాస్టర్, యాక్టర్ అభినయ దర్శన్ అరెస్ట్...

## తన పై దాడి.....అంతా డ్రామా ... బట్టబయలు చేసిన పోలీసులు...

(సువార్త ప్రతినిధి): పాడేరు: కడపకు చెందిన పాస్టర్, నటుడు అభినయ్ దర్శన్పై అల్లూరి సీతారామరాజు జిల్లా జీకేవీధి మండల పరిధిలో దాడి, హత్యాయత్నం జరిగాయనే ప్రచారమంతా కట్టుకథేనని పోలీసులు దర్యాప్తులో వెల్లడైంది. దీని వెనుక కథ, స్క్రీన్ప్లే, దర్శకత్వమంతా ఆయనదేనని నిగ్గుతేలింది. తన కారుపై దాడి చేసినట్లు, తనను చంపేందుకు ప్రయత్నించినట్లు కొందరు వ్యక్తులతో అభినయ్ దర్శన్ నటింపజేసి, ఆ దృశ్యాల్ని చిత్రీకరించారు. వాటిని ఇన్స్టాగ్రామ్, ఫేస్బుక్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తిచేసి, తనపై హత్యాయత్నం జరిగిందంటూ అభినయ్ పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లాలనే కుట్రలో భాగంగా ఈ డ్రామాను రక్తికట్టించారు. పోలీసులు దర్యాప్తు చేయడంతో 24 గంటల్లోనే గుట్టు రట్టైంది. తనపై దాడి చేసినట్లు ఎక్కడ నటించాలి? ఎలా నటించాలి? సీన్ ఎలా క్రియేట్ చేయాలి? తదితర అంశాలపై అభినయ్ ముందే సంబంధీకులకు దిశానిర్దేశం చేసినట్లు తేలింది. నటించినందుకు కొందరికి డబ్బులు చెల్లించినట్లు గుర్తించారు. ఫోన్పే చెల్లింపులను వివరాలను పోలీసులు బయట పెట్టారు. భరోసా పార్టీ అధ్యక్షుడిగా చెప్పుకొనే పాస్టర్ అభినయ్ దర్శన్ కొన్నాళ్లుగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. తాను గిరిజనుల సమస్యలు తెలుసుకుని వాటిని



పరిష్కరిస్తున్నానని, అది ఓర్వలేక కొందరు ఆగంతకులు వాట్సప్ కాల్ చేసి తనను చంపేస్తామని బెదిరిస్తున్నారంటూ అభినయ్ ఇటీవల ఓ వీడియో విడుదల చేశారు. నిజంగా తనపై దాడి, హత్యాయత్నం జరిగాయంటూ నమ్మించే డ్రామాకు స్కెచ్ గీశారు. జీకే వీధికి చెందిన వసంతకుమార్ అనే గిరిజన యువకుడిని ఇన్స్టాగ్రామ్ ద్వారా సంప్రదించి.. హత్యాయత్నం చేసినట్లు నటించాలని, అందుకు డబ్బులిస్తానని వాయిస్ మెసేజ్లు పంపారు. ఆ తర్వాత సోమవారం కుట్రను అమలు చేశారు. జీకే వీధి మండలం మొండిగెడ్డ పంచాయతీ నీరుతోటపాలెం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు తనపై దాడి చేశారంటూ.. అభినయ్ పెద్ద ఎత్తున సామాజిక మాధ్యమాల్లో వీడియోలు వైరల్ చేయించుకున్నారు. దాడిలో తనకు గాయాలైనట్లు ఆయన నటించారు. ఎలాంటి గాయాలూ కాలేదని వైద్యుల నివేదికలో తేలింది. అభినయ దర్శన్ తనను ఇన్స్టాగ్రామ్ ద్వారా సంప్రదించి.. దాడి చేసినట్లు నటించాలని, అలా చేస్తే డబ్బులిస్తానని చెప్పారంటూ వసంతకుమార్ ఓ వీడియో విడుదల చేశారు.

# చైనాలో చిన్నపిల్లలా సండే స్కూల్ విషయములో క్రైస్తవులు అరెస్ట్.....

(సువార్త ప్రతినిధి): నైరుతి చైనాలోని ఒక గృహ చర్చికి చెందిన ఆరుగురు క్రైస్తవులను అరెస్టు చేశారు. ఈ కేసు క్రైస్తవ కార్యకలాపాలపై ఆంక్షలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయని సూచిస్తోందని మత స్వేచ్ఛా కార్యకర్తలు పేర్కొన్నారు. హింసను పర్యవేక్షించే చైనాఎయిడ్ నివేదికల ప్రకారం, గ్విజౌ ప్రావిన్స్లోని కైలీ నగర అధికారులు ఐదుగురు పురుషులను, ఒక మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఈ బృందంపై మోసం, అలాగే "ప్రజా శాంతికి భంగం కలిగించే కార్యకలాపాలలో పాల్గొనేందుకు మైనర్లను సమీకరించడం'' వంటి ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసు గురించి తెలిసిన వర్గాల సమాచారం ప్రకారం, ఈ ఆరోపణలు ప్రధానంగా పిల్లల ఆదివారం పాఠశాల తరగతులు నిర్వహించడం వంటి సాధారణ చర్చి పద్ధతులకు సంబంధించినవి. చైనాఎయిడ్ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు బాబ్ ఫూ, ఈ అరెస్టులను మత సమూహాల పట్ల చైనా వ్యవహరిస్తున్న తీరులో ఒక తీవ్రమైన పరిణామంగా అభివర్ణించారు.


ఆయన ఇలా అన్నారు: ''ఆదివారం పాఠశాలను, పిల్లలతో శాంతియుతంగా విశ్వాసాన్ని పంచుకోవడాన్ని నేరంగా పరిగణించడం చట్టాన్ని దారుణంగా దుర్వినియోగం చేయడమే కాకుండా,



తల్లిదండ్రులు మరియు చర్చిల ప్రాథమిక హక్కులపై ప్రత్యక్ష దాడి." చైనాలోని న్యాయ నిపుణులు ఆరోపణల స్వభావంపైనా, కేసును నిర్వహించిన తీరుపైనా ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. చైనా చట్టం ప్రకారం, "ప్రజా శాంతికి భంగం కలిగించే కార్యకలాపాలలో పాల్గొనేలా మైనర్లను సమీకరించడం" అనే నేరం సాంప్రదాయకంగా కొట్లాటలు, దొంగతనం లేదా సామాజిక స్థిరత్వానికి ముప్పుగా పరిగణించబడే చర్యల వంటి ప్రవర్తనలతో ముడిపడి ఉంది.న్యాయబద్ధమైన ప్రక్రియపై కూడా మరిన్ని ఆందోళనలు వ్యక్తమయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే న్యాయ సహాయం పొందినప్పటికీ, ప్రతివాద న్యాయవాదుల వాదనలను పూర్తిగా వినకుండానే ప్రాసిక్యూటర్లు అరెస్టులను ఆమోదించారని నివేదికలు సూచిస్తున్నాయి. మతపరమైన మైనారిటీలపై జరుగుతున్న హింసలో ఈ పరిణామాలు ఒక "దిగ్భ్రాంతికరమైన కొత్త దశ" అని ఫూ అభివర్ణించారు.

"ఈ కేసును నిశితంగా పర్యవేక్షించాలని మేము అంతర్జాతీయ సమాజానికి, ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు, మరియు మానవ హక్కుల సంస్థలకు పిలుపునిస్తున్నాము," అని ఫూ అన్నారు. "ప్రజా వేదికపై, విశ్వాసం గల ప్రజలను హింసాత్మకంగా అణచివేస్తున్న ఈ దుష్ట వ్యవస్థకు వ్యతిరేకంగా మనం గళం విప్పుదాం. మరియు మనం వారితో ఉన్నట్లుగా భావించి, జైలులో ఉన్న మన సోదర సోదరీమణులను ప్రార్థనలో స్మరించుకుందాం." క్రైస్తవులు అత్యంత తీవ్రమైన హింసను ఎదుర్కొంటున్న దేశాలకు ర్యాంకులు ఇచ్చే 'ఓపెన్ డోర్స్ వరల్డ్ వాచ్ లిస్ట్'లో చైనా 17వ స్థానంలో ఉంది.

# ప్రతిపాదిత విదేశీ నిధుల చట్ట సవరణలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాక్రైస్తవ సంఘాలు..



(సువార్త ప్రతినిధి): భారతదేశంలోని క్రైస్తవ న్యాయవాదులు మరియు పౌర సమాజ నిపుణులు, దేశ విదేశీ నిధుల చట్టానికి ప్రతిపాదిత మార్పులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సవరణల వల్ల, పేద మరియు బలహీన వర్గాలకు సేవ చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు సృష్టించిన ఆస్తులను ప్రభుత్వం తన నియంత్రణలోకి తీసుకునేందుకు వీలు కలుగవచ్చని వారు హెచ్చరించారు. క్రైస్తవ న్యాయవాద సంస్థ అయిన అలయన్స్ డిఫెండింగ్ ఫ్రీడమ్ (ADF) యొక్క భారత శాఖ మే 16న నిర్వహించిన ఒక ఆన్లైన్ సెమినార్లో ఈ ఆందోళనలపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమానికి సుమారు 1,000 మంది పాల్గొన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత కేంద్ర మంత్రివర్గం, విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (FCRA)కు ప్రతిపాదిత సవరణలను మార్చిలో ఆమోదించింది. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు విదేశీ నిధులను ఎలా స్వీకరించాలి, ఎలా ఉపయోగించాలి అనే విషయాలను ఈ చట్టం నియంత్రిస్తుంది. ఈ బిల్లు ఇంకా ఆమోదం పొందనప్పటికీ, పార్లమెంటు రాబోయే వర్షాకాల సమావేశాల్లో దీనిపై మరింత చర్చ జరిగే అవకాశం ఉంది. మానవతా, స్వచ్ఛంద కార్యక్రమాల కోసం విదేశీ విరాళాలపై ఆధారపడే సంస్థలపై ఈ సవరణలు ప్రభుత్వ నియంత్రణను గణనీయంగా పెంచవచ్చని వెబినార్లో వక్తలు హెచ్చరించారు.

విదేశీ విరాళాలతో సృష్టించిన ఆస్తులకు సంబంధించిన విషయం అత్యంత తీవ్రమైన ఆందోళనలలో ఒకటని చార్టర్డ్ అకౌంటెంట్ సంజయ్ పాత్రా అన్నారు. సంస్థలు ఇప్పటికే చాలా సంవత్సరాలుగా తమ ఆస్తులు, వనరుల గురించి వివరణాత్మక నివేదికలను సమర్పించాల్సి ఉందని ఆయన వివరించారు.

Printer, publisher, Editer and owend by Chatla Luthar Prasanth Kumar,Publishing from 15-7, Chalapadu, Chebrole (M), Guntur-522124, Printed at Suvartha printers, Chalapadu (V"Chebrole (M),Guntur.Ap.
Editor Chatla Luthar Prasanth Kumar,E-mail news@suvaartha.com (M)888 66 123 28